వార్త

ఆదివారం

11 డిసెంబరు, 2022



# వణికించే చలిలో జర భద్రం

తారాతీరం

# ఐటెం సాంగ్‌లో రష్మిక!



ఈ మధ్య కాలంలో సినిమాలలో ఐటెం సాంగ్స్ హవా బాగా నడుస్తోంది. ఒకప్పుడు ఐటెం సాంగ్స్ అంటే ప్రత్యేకంగా డ్యాన్సర్లు చేసేవారు. ఇప్పుడు స్టార్ హీరోయిన్లు ఐటెంలకు మొగ్గు చూపుతున్నారు. స్టార్ హీరోయిన్లతో ఐటెం సాంగ్ పెడితే తమ సినిమాకు క్రేజ్ పెరుగుతుందని నిర్మాతలు కూడా భావిస్తున్నారు. దీంతో ఖర్చుకు వెనుకాడకుండా హీరోయిన్లకు భారీ పారితోషికం ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. ఇప్పటికే శ్రియ నుంచి సమంత వరకు ఎంతో మంది స్టార్ హీరోయిన్లు ఐటెం సాంగుల్లో తళుక్కున మెరిసారు. ఇప్పుడు రష్మిక మందన్న కూడా ఈ జాబితాలో చేరింది. మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ఐటెం సాంగ్ కోసం రష్మికను తీసుకుంటున్నట్టు సమాచారం. త్రివిక్రమ్ ఇప్పటివరకు తీసిన సినిమాల్లో ఇంతవరకు ఐటెం సాంగ్ లేదు. తొలిసారిగా రష్మికతో తన సినిమాలో ఐటెం సాంగ్ చేస్తున్నారు. ఈ సినిమాలో మహేశ్ సరసన పూజా హెగ్డే నటిస్తోంది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# పాన్ ఇండియా సినిమాలో విలన్‌గా సంజయ్‌దత్?



ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నాలుగు సినిమాలు చేస్తోన్న విషయం విదితమే. వాటిలో ఓం రౌత్‌తో చేస్తోన్న 'ఆదిపురుష్' ఇటీవల షూటింగ్ పూర్తి చేసుకోగా, దాని విఎఫ్ఎక్స్ వర్క్ జరుగుతోంది. అలానే కెజిఎఫ్ మూవీస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో ప్రభాస్ చేస్తోన్న 'సలార్' వేగవంతంగా షూటింగ్ జరుపుకుంటోంది. అలాగే నాగ అశ్విన్‌తో చేస్తోన్న ప్రాజెక్ట్‌కి కూడా పలు షెడ్యూల్స్‌తో కొనసాగుతోంది. అయితే వీటితో పాటు ఇటీవల మారుతీ దర్శకత్వంలోనూ ఒక చిత్రం మొదలెట్టారు ప్రభాస్. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాని మంచి యాక్షన్‌తో కూడిన పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్‌గా మారుతి తెరకెక్కిస్తున్నట్లు చెప్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ హీరో సంజయ్‌దత్ విలన్‌గా దాదాపు ఫిక్స్ అయినట్టు సమాచారం. ఇందులో ప్రభాస్‌కి జోడీగా ముగ్గురు కథానాయికలు నటించనున్నారట. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

ఆదివారం వార్త

sunmagvaartha@gmail.com

11 డిసెంబరు, 2022


## మంచి ముత్యాలు

ప్రేమించిన వ్యక్తితో పెండ్లి జరిపించమని కొందరు ప్రార్థిస్తారు. పెండ్లాడిన వ్యక్తిని ప్రేమించేట్లు చేయమని నేను ప్రార్థిస్తాను.

- ర్రోజ్ పాంటర్ స్టోక్స్

## విషయ విశేషం


కుండల మీద 'వర్లీ పెయింటింగ్స్... 4

'సంఘీ'భావం....5

అంతంలేని కష్టాల పర్వం

అందాల అగ్ని పర్వతం ఫ్యూజి...6

కవర్ స్టోరీ..8

వణికించే చలిలో

జర భద్రం

ఈవారం కవిత్వం..12

వీధి ఆవుల వ్యధ

అందమైన పక్షుల్లో......14

అగస్త్యుడు ఆరాధించిన.....18

కథ.. 20

ఇష్ట కామ్యార్థ సిద్ధిరస్తు

సాహిత్యం.. 23

పత్రికారంగంలో తెలుగు భాషావికాసం

మనిషిని మనిషిగా చూడాలి..26

నిజాయితీ విలువ... 30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

సరదాగా కాసేపు..


వగైరా..వగైరా..





# తాజా వార్తలు

## భార్యకు వెల కట్టలేని బహుమతి



భార్యల పుట్టిన రోజు సందర్భంగా ఊహాకందని వేడుకలు చేయడం, వారికిష్టమైన నగలు/విలువైన వస్తువులు కొనివ్వడం చేస్తుంటారు భర్తలు. కానీ... గుజరాత్‌లోని వడోదరకు చెందిన స్వప్నాలీ భర్త సునీత్ అందుకు భిన్నంగా తన భార్య కల్లో కూడా ఊహించని ఆమెకు ఓ కానుక ఇచ్చాడు. గత సంవత్సరం స్వప్నాలీ తల్లి కేన్సర్‌తో చనిపోయింది. వాళ్ల సొంత ఊరు మంజుసర్ గ్రామంలో ఆమె అంత్యక్రియలు చేసారు. స్వప్నాలీకి పుట్టి పెరిగిన గ్రామంతో ఎనలేని అనుబంధం ఉండటంతో సునీత్‌కి ఓ సరికొత్త ఆలోచన వచ్చింది. అత్తగారి చివరి కార్యక్రమాలన్నీ పూర్తయిన తరువాత శ్మశానం పక్కన ఉన్న బంజరు భూమిని కొని, చుట్టూ ప్రహరీ నిర్మించి సీతాకోక చిలుకల్ని ఆకర్షించే పూలమొక్కల్ని నాటాడు. ఎంతో అందంగా తీర్చిదిద్దిన ఆ బటర్‌ఫ్లై పార్కును భార్య పుట్టినరోజు సందర్భంగా కానుకగా అందించాడు. అంతేకాదు.. తమ కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు ఎవరైనా అంతిమ కార్యక్రమాలకు సంబంధించిన తంతుల్ని అక్కడ జరుపుకోవచ్చని చెప్పాడు.

### గాడిదల సంత



'ప్రతి కుక్కకూ ఒక రోజు వస్తుందనేది' నానుడిన కానీ ఇక్కడ ప్రతి గాడిదకీ ఒక పేరు వస్తుంది. అదేదో చిన్నా చితకా పేరు కాదు.. బాలీవుడ్ సూపర్ స్టార్ల పేరు. అసలు సంగతేమిటంటే- మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ ప్రాంతంలో మందాకినీ నదీ తీరంలో దీపావళి తరువాత పెద్ద ఎత్తున గాడిదల సంత జరుగుతుంది. మన పల్లెల్లో గేదెల సంతలు జరుగుతుంటాయి కదా.. అలాగేనన్న మాట. ఔరంగజేబు కాలం నుంచి జరుగుతున్న ఈ సంతకు దేశం లోని పలు ప్రాంతాల నుంచి వేలాది గాడిదలు తరలివస్తుంటాయి ఈ సంతకు. వచ్చిన ప్రతి గాడదనూ శుభ్రంగా కడిగి రంగులు అద్దుతారు. వాటిలో కాస్త ఒడ్డూ పొడూ ఉన్న అందమైన గాడిదలు లక్ష నుంచి రెండు లక్షల వరకు పలుకుతాయి. అలాంటి వాటికి యజమానులు బాలీవుడ్ తారల పేర్లు పెట్టడం విశేషం. సుమారు వారం రోజుల పాటు జరిగే ఈ సంతలో కొన్ని కోట్ల లావాదేవీలు జరుగుతాయి. గాడిదలకీ ఇంత డిమాండ్ ఉంటుందా? అనిపిస్తోంది కదూ!



# కుండల మీద 'వర్లీ పెయింటింగ్'

'వర్లీ పెయింటింగ్' మహారాష్ట్రలోని గిరిజనుల కళ. వాల్ పెయింటింగ్‌లోనూ బ్రైట్‌గా వెలిగిపోతున్న ఈ కళ ప్రస్తుతం కుండల మీద కూడా ఎంతో అందంగా కనిపిస్తోంది. పూర్వ కాలంలో సున్నం, కుంకుమతో రంగులు అద్ది కుండలను అలంకరించేవారు.



## పసుపు-కుంకుమలు

పసుపు, కుంకుమ రంగులను పోలిన పెయింట్స్‌ను కుండలకు అప్లై చేసి, వాటి మీద ఏ చిన్న అలంకరణ చేసినా అందంగా కనిపిస్తాయి. పండుగ రోజున ఇంట్లో ఓ ఖాళీ ప్రదేశంలో, కార్నర్ భాగంలో దొంతులు పేర్చి ఇంటిని అందంగా అలంకరించుకోవచ్చు. చిన్న చిన్న మార్పులతో ఇంటికి లక్ష్మీకళ తీసుకురావచ్చు.

## డిజైనర్ టచ్

పూసలు, జరీదారాలు, లేసులు, కుందన్స్ అతికించి దొంతులను మరింత అందంగా తీర్చిదిద్దుకోవచ్చు. రకరకాల డిజైన్లలో మార్కెట్‌లోనూ లభిస్తున్నాయిప్పుడు. మహిళలు తమదైన సృజనాత్మకతను జోడించి దొంతులను తమ అభిరుచికి తగినట్లుగా డిజైన్ చేసుకుంటున్నారు.





# 'సంఘీ' భావం



## అంతంలేని కబ్జాల పర్వం

విలువైన ప్రభుత్వ భూముల కబ్జాలకు అంతం లేకుండా ఉంది. కొందరు ప్రజాప్రతినిధుల నుంచి రియల్టర్లు, వ్యాపారులు, రాజకీయ పలుకుబడి ఉన్న బడా వ్యక్తులు యదేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ భూములు, ఇనాం భూములు, దేవాదాయశాఖ భూములు, చెరువులు, కుంటలు, కాల్వలకు చెందిన భూములను కబ్జా చేసి పక్కా భవంతులు నిర్మించుకుంటున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో శివారు ప్రాంతాల్లో కబ్జాలపర్వం జోరుగా సాగుతోంది. అధికార పార్టీలో ఉన్న కొందరు నేతలు, ప్రజాప్రతినిధులు భారీ ఎత్తున భూకబ్జాలకు పాల్పడుతూ భవంతులు నిర్మించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంపై ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారే కాని కబ్జాలపై ఏ పార్టీ కూడా అధికారం చేపట్టిన తరువాత చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రెండు తెలుగు రాష్ట్రాలో ఏదో ఒక ప్రాంతంలో నిరంతరం కబ్జాల పర్వం కొనసాగుతూనే ఉంది. కబ్జాలకు అడ్డుకట్టవేయాల్సిన రెవెన్యూ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది. ఒకవేళ చర్యలు తీసుకున్నా ఆయా అధికారులపై వేధింపులు ప్రారంభం అవుతున్నాయి. దీనితో కబ్జాలు జరుగుతున్నట్లు గుర్తించినా చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ యంత్రాంగం చొరవ చూపలేకపోతోంది. చిన్న చిన్న కబ్జాలను సైతం అరికట్టలేని నిస్సహాయ స్థితిలో నేడు ప్రభుత్వ అధికారులు ఉన్నారు. ముఖ్యంగా చెరువులు, కాల్వలు కబ్జాలకు గురౌతున్నాయి. హైదరాబాద్‌లో పరిశీలిస్తే మూసీ నది మొత్తం కబ్జాలకు గురైంది. దీనితో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు పారేందుకు అవకాశం లేకపోవడంతో చుట్టుపక్కల కాలనీలను ముంచెత్తుతోంది. ఇటీవల కాలంలో ముంపు ప్రాంతాల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లాల్లో కూడా ఇదే విధమైన కబ్జాలు కొనసాగుతున్నాయి. ఒక పథకం ప్రకారం స్థలాన్ని కబ్జా చేసి ఒకటి రెండు నెలల్లో పక్కా భవనాన్ని నిర్మించుకుంటున్నారు. అనంతరం తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేయించి మున్సిపల్ శాఖ నుంచి మంచినీరు, విద్యుత్ సరఫరా వంటివి పొందుతున్నారు. ఇక వారిని అక్కడి నుంచి తొలగించే అవకాశం లేకుండా పోతోంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఫైనాన్సియల్ సిటీ, బైరామల్‌గూడ వంటి ప్రాంతాల్లో కబ్జాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ భూముల విలువ గణనీయంగా పెరిగి పోవడంతో వందల కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. రాత్రికి రాత్రే భవనాలు వెలుస్తున్నాయి, రోడ్లు వేసి విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటుచేస్తున్నారు. ప్రతి భూకబ్జాకు వెనుక అధికార పార్టీ ప్రతినిధుల మద్దతు ఉంటోందని, అందుకే తాము ఏమీ చేయలేకపోతున్నట్లు అధికారులు వాపోతున్నారు. ఇక విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్‌లను ఏర్పాటుచేస్తున్నారు. ఆదివారం వస్తే చాలు కొనుగోలుదారులు ఈ ప్రాంతాలకు రావడంతో సందడి వాతావరణం నెలకొంటోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్లు వేసి రియల్టర్లు అమ్ముకుంటున్నారు. అక్రమ వెంచర్ల వద్ద భారీ బోర్డులు సైతం పెట్టి ప్లాట్లను విక్రయిస్తున్నారు. అక్రమాలు జరుగుతున్నా వారిని అడ్డుకునే వారు లేకుండా పోయారు. ప్రతి వెంచర్‌కు తాము పెద్దమొత్తంలో డబ్బులను ఆయా ప్రాంతాల్లోని అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బడా నేతలకు ముట్టజెబుతున్నట్లు రియల్టర్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సదరు వెంచర్ నిర్వాహకులు ఏర్పాటుచేసే కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు సైతం హాజరు అవుతున్నారు. ఆయా ఫంక్షన్లలో పాల్గొన్న ప్రముఖుల ఫోటోలను ఆల్బమ్‌లు తయారు చేసి భూమి కొనుగోలు చేయడానికి వచ్చిన వారిని బురిడీ కొట్టించి విక్రయాలు కొనసాగిస్తు న్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులు అక్రమ వెంచర్లు, భూకబ్జాదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఒకరిద్దరిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టినా కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే వారు బెయిల్ తీసుకుంటున్నారు. భూకబ్జాలకు సంబంధించి సరైన చట్టాలు లేకపోవడంతో అధికారులు కూడా కబ్జాదారులపై కఠినంగా వ్యవ హరించలేకపోతున్నారు. పోలీసుల దృష్టికి వెళ్లిన కేసులను సాధారణ సెక్షన్లతో సరిపెడుతున్నారు. భూవిక్రయాలు జోరుగా జరుగుతున్న ప్రాంతాల్లో పోలీసు స్టేషన్లు సెటిల్‌మెంటట్ సెంటర్లుగా రూపాంతరం చెందుతున్నాయి. రౌడీషీటర్లు, కొందరు ప్రముఖ రాజకీయ నాయకులు కూడా సెటిల్‌మెంట్ల ద్వారా లక్షల రూపాయ లను ఆర్జిస్తున్నారు. ప్రభుత్వ భూములు, దేవాదాయ భూముల కబ్జాలు పట్టించుకునే వారు లేకుండా పోయారు. కొన్నింటిని అధికారులు గుర్తించి చర్యలు తీసుకునే ప్రయత్నం చేయగా కబ్జాదారులు కోర్టును ఆశ్రయించి చర్యల నుంచి మినహాయింపు పొందుతున్నారు. సివిల్ కేసులు కావడంతో సంవత్సరాల తరబడి కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. కబ్జాలకు సంబంధించి మీడియా ప్రతిరోజూ ప్రత్యేక కథనాలు ప్రచురిస్తూనే ఉన్నాయి, అయితే అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. చాలా సందర్భాల్లో మీడియా ప్రతినిధులకు కబ్జాదారుల నుంచి హెచ్చరికలు రావడం, అక్కడకక్కడా దాడులు కూడా జరిగాయి. కబ్జాదారులు ఆర్థికంగా బలవంతులు కావడం, రాజకీయ పలుకుబడి ఉండటంతో వారిని ఎదుర్కొనే అవకాశం ఉండటం లేదు. అక్రమ లేఅవుట్లకు విషయంలో అడ్డుకట్ట వేయడానికి సరైన చట్టాలు లేవు. ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులు, పంటకాల్వలు కనిపించకుండాపోతున్నాయి. ఇకనైనా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవడానికి వీలుగా చట్టసవరణలు చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# అందాల అగ్నిపర్వతం ఫ్యూజి

ఫ్యూజి పర్వతం
జపాన్ దేశంలోని అత్యంత ఎత్తయిన పర్వత ప్రదేశం. ఇది జపనీస్ ద్వీపం, హోన్సులో నెలకొని ఉంది. దీని శిఖరం 3776 మీటర్ల(12,389 అడుగులు) ఎత్తు ఉంటుంది. ఇది మంచుతో కప్పి ఉండే ఒక అందమైన అగ్నిపర్వతం. ఏడాదిలో దాదాపు అయిదు నెలలు పైబడి ఇది మంచుతో కప్పబడి ఉంటుంది. జపాన్ రాజధాని నగరమైన టోక్యోకి నైరుతి దిశలో యమనాషి-షిజుయోకా సరిహద్దులో 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. వాతావరణం నిర్మలంగా ఉన్న రోజున టోక్యో నుంచి స్పష్టంగా కనిపిస్తుంది. ఇది మూడు అగ్నిపర్వతాల కలయిక. పై భాగంగా ఉన్నదాన్ని మౌంట్ ఫ్యూజి అని పిలుస్తారు. మధ్య భాగాన కోవెకు అగ్నిపర్వతం, అడుగు భాగాన కొమిఒలరా అగ్నిపర్వతం నెలకొని ఉన్నాయి. 22 జూన్ 2013లో యునెస్కోవారు దీన్ని సాంస్కృతిక ప్రదేశంగా ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చారు.

జపనీయుల పవిత్ర స్థలం
జపనీయులు ఫ్యూజి పర్వతాన్ని పవిత్ర స్థలంగా భావిస్తారు. ఇది వారి జాతీయ సాంస్కృతిక చిహ్నంగా చెప్పుకోవడానికి గర్వపడతారు. జపాన్ సాహిత్యంలో కూడా ఈ పర్వతానికి సర్వోన్నత స్థానం ఉంది. జపాన్‌లోని మూడు పవిత్ర పర్వతాలలో ఫ్యూజి ఒకటి. ఫ్యూజితో పాటు టేట్ పర్వతం, హాకు పర్వతాన్ని సైతం జపాన్‌వారు పవిత్రమైనవిగా భావిస్తారు. ఫ్యూజి పర్వతంపై దేవతలు నివసించేవారని జపనీయులు భావించడం వల్ల ఇదో పూజనీయ ప్రదేశంగా అందరి హృదయాలలో స్థానం పొందింది. ముఖ్యంగా జపాన్‌లోని షింటో మతస్థులు ఫ్యూజిని అతి పవిత్ర స్థలంగా భావిస్తారు. షింటో మతస్థులు ఫ్యూజి పర్వతాన్ని



అధిరోహించాలంటే విధిగా చందనపు చెప్పులు ధరిస్తారు. చెరన్ అనే బౌద్ధ గురువు 13వ శతాబ్దంలో తన అనుచరులతో కలిసి ఈ పర్వత పాదాల చెంత ఒక బౌద్ధ శాంతివనాన్ని నిర్మించారు. 1960లో సమురాయ్ అనే బౌద్ధ సంస్థ ఆధ్వర్యంలో షో-హోండో బౌద్ధ ఆలయాన్ని నిర్మించారు. ఫ్యూజి అగ్ని పర్వతాన్ని బౌద్ధ మతానికి చెందిన ఫ్యూచీ అనే అగ్నిదేవత అని కొందరు జపనీయులు విశ్వసిస్తారు. భూకంపాల వల్ల ఫ్యూజి పర్వతం ఏర్పడిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**ఫ్యూజి విస్ఫోటనం**
దాదాపు 300 సంవత్సరాల క్రితం 1707-1708 మధ్య కాలంలో ఫ్యూజి

షేక్ అబ్దుల్ హకీం జాని

అగ్నిపర్వతం విస్ఫోటనం చెంది తన భీకర రూపాన్ని ప్రపంచానికి చూపించింది. దాదాపు 17 విస్ఫోటనాలు జరిగి విపరీతమైన బూడిదను విరజిమ్మింది. ఆ బూడిద 100 కి.మీ. దూరంలో ఉన్న జపాన్ రాజధాని టోక్యో వరకు పడిందంటే అది ఎంత భీకరమైన పేలుడో సునాయాసంగా అర్థం చేసుకోవచ్చు.
ఆ తరువాత ఇటువంటి విస్ఫోటనాలు జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఫ్యూజి అగ్నిపర్వతం నిద్రాణ స్థితిలో ఉంది. ఆ కారణంగా పర్యాటకులు నిర్భయంగా ఈ పర్వతాన్ని అధిరోహిస్తున్నారు.

**అయిదు సరస్సులు**
వందలాది సంవత్సరాల క్రితం లావా ప్రవాహాల ద్వారా ఈ ప్రాంతంలో అయిదు సరస్సులు ఏర్పడ్డాయి. వాటి పేర్లు కవాగుచికో సరస్సు, యమనకాకో సరస్సు, సైకో సరస్సు, షోజికో సరస్సు, మోటోసుకో సరస్సు. వీటిలో సైకో, షోజికో, మోటోసుకో అనే





మూడు సరస్సులు ఇప్పటికీ భూగర్భ జలమార్గాల ద్వారా ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉన్నాయి. అయిదు సరస్సుల్లో అతిపెద్దది యమనకాకో సరస్సు. ఈ అయిదు సరస్సులలోకెల్లా అత్యంత సులభంగా చేరుకోదగినది కవాగుచికో సరస్సు. దీని చుట్టుకొలత సుమారు 13 కి.మీ. ఉంటుంది. కొన్ని సరస్సుల్లో అరుదైన హంసలను పోలిన పక్షులు కనిపిస్తాయి.

ఎనిమిది శిఖరాలు

ఓషైదాకే, ఇజుదాకే, జోజుడాకే, కొమగటకే, ముషిమతకే, కెంగామైన్, హుకుసందకే, కుసుషిడాకే ఇత్యాది ఎనిమిది శిఖరాలు ఈ ప్రాంతంలో దర్శనమిస్తాయి.

ఫ్యూజి అధిరోహకులు

అనేకమంది ఫ్యూజి పర్వతాన్ని అధిరోహించారు. క్రీ.శ.663లో ఒక బౌద్ధ సన్యాసి తొలిసారిగా ఫ్యూజి పర్వతాన్ని అధిరోహించినట్లు చరిత్ర చెబుతుంది. ఆ తర్వాత అనేకమంది పురుషులు నిరంతరం శిఖరాన్ని అధిరోహించారు. మహిళలు మౌంట్ ఫ్యూజిని అధిరోహించడానికి 1912 వరకు అనుమతించలేదు. వారు అధిరోహించకూడదని నిషేధంలో ఉండేది. ప్రస్తుతం ఇటువంటి నిషేధాలు లేవు. అనేకమంది మహిళలు ఫ్యూజి పర్వతాన్ని అధిరోహిస్తున్నారు. ఈ పర్వతాన్ని అధిరోహించాలని ఇప్పుడు పెద్ద సంఖ్యలో పర్యాటకులు అక్కడికి వస్తున్నారు. యోషిదా, ఫుజినోమియా, సుబశిరి,



గోటెన్బా అనే నాలుగు ప్రధాన మార్గాల ద్వారా పర్వతారోహకులు ఫ్యూజిని అధిరోహించారు. ఫుజినోమియా అనే మార్గం రెండవ స్థానంలో ఉంది. ఈ మార్గం కొంత నిటారుగా ఉంటుంది. అనుభవజ్ఞులైన పర్వతారోహకులు ఈ మార్గం ద్వారా ఫ్యూజి పర్వతాన్ని అధిరోహించడానికి ఇష్టపడతారు. పైగా ఫుజినోమియా మార్గం ద్వారా ఫ్యూజి శిఖరాన్ని ఇతర మార్గాలతో పోల్చుకుంటే తక్కువ సమయంలో చేరుకోవచ్చు. ప్రధానంగా జులై 1 నుండి సెప్టెంబరు మధ్య అధిరోహించడానికి అనువైన సమయం. ఆ సమయంలో మంచు ఉండదు. అధిరోహించడానికి అనుమతి కూడా అప్పుడే లభిస్తుంది. ఫ్యూజి పర్వతం అధిరోహించడం అంత సులభమైన పని కాదు. అక్కడ విపరీతమైన చలి ఉంటుంది. ఫ్యూజి శిఖరం అధిరోహించడానికి 4 నుండి 8 గంటల సమయం పడుతుంది. పర్వతారోహణ చేసేటప్పుడు చలికి తట్టుకోవడానికి ప్రత్యేకమైన దుస్తులు, ఇతర సామగ్రి అద్దెకు ఇస్తారు. అధిరోహకులు సాధారణంగా తెల్లవారుజామున శిఖరానికి చేరుకొని సూర్యోదయం చూడటానికి రాత్రిపూట బయలుదేరుతారు.

రాత్రిపూట ఫ్యూజి పర్వతాన్ని అధిరోహించేటప్పుడు తలపై బ్యాటరీ దీపాలను ధరిస్తారు. ఆ వెలుగులో దారిని చూస్తూ వెళతారు. కొన్ని సందర్భాలలో పొగమంచు వల్ల దారి కూడా కనిపించదు. ఫ్యూజి పర్వతంపై నుండి సూర్యోదయం తిలకించాలనుకున్నవారు ఇక్కడ ఏర్పాటు చేసిన వస్త్ర గుడారాలలో రాత్రి వేళలో బస చేసే సౌకర్యం ఉంది. పలుచోట్ల ప్రాథమిక చికిత్సా కేంద్రాలు అందుబాటులో ఉంటాయి.

ప్రతి సంవత్సరం అయిదు లక్షల మంది ప్రజలు, పర్యాటకులు ఈ శిఖరాన్ని అధిరోహిస్తున్నారు. వీరిలో 30 శాతం మంది విదేశీయులు కాగా, 70 శాతం మంది జపాన్ వాసులు.



**(మిగతా 27వ పేజీలో)**



# వణికించే చలిలో జర భద్రం

కవర్‌స్టోరీ

**వాసిలి సురేష్**

**తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతున్నాయి. అనేక ప్రాంతాలలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.**

**గ్రామీణ** ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాల్లోనూ రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం పనులకు వెళ్లేవారు, మున్సిపల్ కార్మికులు చలితీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలు దాటుతున్నా చలితీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. దీంతో సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు బయట తిరగలేని పరిస్థితి ఏర్పడుతున్నది. రోజు రోజుకూ చలితీవ్రత పెరుగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నా సాయంత్రం ఆరు గంటల నుంచి చలితీవ్రత పెరుగుతోంది. ఈ కారణంగా పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే చాలా మంది ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రులలో చేరుతున్నారు. దోమల వ్యాప్తి కూడా ఎక్కువగా ఉండడంతో చిన్నారుల నుంచి పెద్దవారి వరకు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా బారిన పడుతున్నారు. గతంలో ఊపిరితిత్తులు, ఆస్తమా ఇతరత్రా సమస్యలతో బాధపడుతున్నవారికి చలితీవ్రంగా కారణంగా ఎక్కువ అవుతోంది.



జాగ్రత్తలు పాటించకుంటే ప్రాణాలకు ముప్పు వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాతావరణంలో మార్పులతో పాటు అల్పపీడన ప్రభావాలతో ఈ ఏడాది నవంబరు రెండో వారం నుంచి నమోదు అవుతున్న తక్కువ ఉష్ణోగ్రతలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ చలికాలంలో సీజనల్ వ్యాధులతో పాటు ఆయాసం, గుండెజబ్బులు ఎక్కువగా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రజలు ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉదయం జాగింగ్, వాకింగ్‌కు వెళ్లేవారి చర్మం పొడిబారి బిరుసుగా మారే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వీటితో పాటు కాళ్ల మడమలు, పెదాలు పగలడం వంటి సమస్యలు వస్తున్నాయి. తెల్లవారుజామున పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు.

**ఉన్నిదుస్తుల వాడకంలో రక్షణ**

చలితీవ్రత పెరగడంతో ఈ తీవ్రత నుంచి తప్పుకోవడానికి ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. చలికాలంలో ఎక్కువగా ఉన్నిదుస్తులు ధరించడం వల్ల చలి నుంచి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, యువతీ యువకులు స్వెట్టర్స్, హుడీస్, మంకీ క్యాప్స్, మఫ్లర్లు, గ్లౌజులు, రగ్గులు వాడకం ద్వారా చలి నుంచి రక్షణ పొందవచ్చు.

దీంతో పాటు వేడిని త్వరగా గ్రహించే డార్క్ కలర్స్ వాడాల్సి ఉంటుంది. జనాలు ఎక్కువగా మంకీ క్యాప్స్, మఫ్లర్స్, ఉలెన్ స్వెట్టర్స్, బ్లాంకెట్స్, గ్లౌజ్‌లు వంటివి కొనుగోలు చేస్తున్నారు. నగరాలలో పలు ప్రాంతాలలో రోడ్ల వెంట వ్యాపారులు పెద్ద ఎత్తున స్వెట్టర్లు, మంకీ క్యాప్స్, బ్లాంకెట్స్‌కు సంబంధించిన దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. శీతాకాలం ప్రారంభంలోనే చలితీవ్రంగా పెరగడంతో వీటి వ్యాపారం కూడా పెరిగింది.



### ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ పెట్టాలి

చలి పెరిగిన నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు ఎదుర్కొనేవారు అప్రమత్తంగా ఉండాలి.

ఉదయం నడకకు వెళ్లే వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఎండ వచ్చిన తర్వాత వెళ్లాలి. ఇప్పటికే కరోనా బారినపడి కోలుకున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో చలితీవ్రత తగ్గేవరకు జాగ్రత్తలు తీసుకుంటూనే ఉండాల్సిన అవసరం ఉంది.

చలితీవ్రతతో పాటు తుపాన్ల కారణంగా చల్లని గాలులు ఎక్కువగా వీస్తుండడం వల్ల ఎక్కువ మంది జలుబు, తలనొప్పి, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గతంలో కరోనా బారిన పడి కరోనా నుంచి కోలుకున్న వారికి పెరుగుతున్న చలి వాతావరణం మరింత ఇబ్బందికరమైన పరిస్థితులుగా ఉండవచ్చు. కరోనా వచ్చినపుడు ఎక్కువ మోతాదులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్‌ను వినియోగించి ఉంటారు. కనుక వారి శరీరంలో వ్యాధినిరోధక శక్తి తగ్గడంతో పాటు వారికి ఊపిరితిత్తుల సమస్య ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో చలిగాలికి బయటకు రావడం వల్ల వీరు నిమోనియా బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఊపిరితిత్తులకు ఇది మరింత ప్రమాదకరంగా మారుతుంది. కాబట్టి బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆస్తమా, మధుమేహం, టీబీ, హెచ్‌ఐవీ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడుతున్న వారికి ఈ వాతావరణం అంత మంచిది కాదు. ఈ



లక్షణాలున్నవారు చల్లని గాలులు వీస్తున్న సమయంలో బయటకు రాకపోవడమే మంచిది. ఎందుకంటే జలుబు, వైరల్ జ్వరాల బారినపడి ఆస్పత్రులకు వెళ్తున్నవారి సంఖ్య బాగా పెరుగుతోంది. బయట ఎంత చల్లగా ఉన్నా ఏసీలను ఆన్ చేసుకుని ఉండడం



చాలా మందికి అలవాటు. ఈ పరిస్థితుల్లో సాధ్యమైనంత వరకు ఏసీల వినియోగాన్ని తగ్గించడం మంచిది. అవసరమైతేనే ఏసీలను వినియోగించాలి. ఏసీ వినియోగం తగ్గిస్తే మంచిది. ఉదయం వేళల్లో ఎండలో కొంతసేపు తప్పకుండా ఉండాలి. గతంలో కరోనా బారిన పడినప్పుడు వారికి ఊపిరితిత్తుల పైనే ఎక్కువ ప్రభావం ఉంటుంది. అలాంటివారు చలిగాలులకు ప్రభావితమైతే ముఖ్యంగా ఫ్లూ, నిమోనియా వంటి రెండో దశ ఇన్ఫెక్షన్లకు త్వరగా గురయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటివారు అప్రమత్తంగా ఉండాలి. తరచుగా జలుబు, జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు వస్తూ పరిస్థితులు ఇబ్బందికరంగా ఉంటే ఫ్లూ, నిమోనియా వ్యాక్సిన్లు వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గతంలో కరోనా వచ్చినవారు ఈ వ్యాక్సిన్లు ఏడాదికి ఒకసారి వేసుకోవాలి. కళ్లు పచ్చబడుతున్నా, గుండెవేగం పెరుగుతున్నా, జ్వరం వచ్చిన వచ్చి వెళ్తున్నా తప్పనిసరిగా వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.

ఆహారపు అలవాట్లు మార్చాలి

శీతాకాలం కావడంతో వాతావరణం కూడా చల్లగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో వేడివేడిగా ఉంటే ఆహారం తీసుకోవడం మంచిది.

సాధ్యమైనంత వరకు వేపుళ్లను పూర్తిగా తగ్గించాలి. వీలైనంత వరకు సూప్స్ రూపంలో తీసుకోవాలి.

పండ్లను ఎక్కువగా తినాలి.

గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి. ఈ పరిస్థితుల్లో శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు ప్రయత్నించాలి. పొడిదగ్గు ఉంటే తాజా పుదీనాఆకులు వేడినీటిలో వేసుకొని ఆవిరి పీల్చాలి. తేలికపాటి వ్యాయామాలు, యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం లాంటివి చేయాలి.

సులువుగా జీర్ణమయ్యే ఆహారాలను తీసుకోవాలి. ధూమపానం, మద్యపానం అలవాట్లను మానుకోవాలి.

**చిన్న పిల్లల పట్ల శ్రద్ధ పెట్టాలి**

చిన్న పిల్లలపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వివిధ రుగ్మతలు ఉన్నవారు జాగ్రత్తలు పాటిస్తే చలికాలంలో వ్యాధులు బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో చిన్నారులకు చలి నుంచి రక్షణకు స్వెటర్లను తొడిగించాలి. వేడి నీటితో స్నానం చేయించాలి. పిల్లలకు ఇచ్చే ఆహారంలో ఆకుకూరలు ఎక్కువగా ఉండాలి. చలికాలంలో రాత్రివేళ తమ పనులు ముగించుకొని ఇంటికి వెళ్లేవారు, పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు ఉన్నిదుస్తులు ధరించాలి. బ్రాండెడ్ దుస్తులు అయితే మంచిది. బైక్‌పై వెళ్లేవారు మంకీక్యాప్, కాళ్లకు షూ, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి. చిన్నారులను చలికాలంలో వయస్సునుబట్టి కొంచెంసేపు సూర్యరశ్మి తాకేలా చూసుకోవాలి. గ్లౌజస్ తప్పకుండా తొడగాలి. చలి నుంచి రక్షణ ఉన్నిదుస్తులు వాలి. శీతాకాలంలో పిల్లల్లో శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. కోరింత దగ్గు, ఆస్తమా ఉంటే చల్లటి నీటితో స్నానం చేయించకూడదు. మంచులో ఉండే కాలుష్యంతో గొంతు దెబ్బతినే అవకాశం ఉంది. పెట్రోలియం జల్స్, లిక్విడ్స్ పెరాఫిన్ జల్స్ వంటివాటితో స్నానం చేయాలి. పిల్లలకు శీతాకాలంలో ఆకలి ఎక్కువగా ఉంటుంది. పోషక విలువలు కలిగిన ఆహారం మాత్రమే అందించాలి.



నెలలోపు పిల్లలకు చలిగాలి తగలకుండా దుప్పట్లు కప్పి ఉంచాలి. గదుల్లో ఫ్యాన్లు, ఏసీలు వేయవద్దు. చిన్నారుల చర్మం పొడిబారికుండా మెత్తగా ఉండేందుకు క్రీమ్స్ రాయాలి. చిన్న పిల్లలను ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలపై తిప్పకూడదు. ఎదిగిన పిల్లలకు మాస్క్ వాడాలి. పిల్లలకు వేడిగానే ఆహారం పెట్టాలి. గోరువెచ్చని నీళ్లు తాగించాలి. ఈ కాలంలో బయటి ఆహార పదార్థాలు తినకూడదు. శీతల పానీయాలు, చాక్లెట్స్, ఐస్క్రీమ్స్‌లు తినకుండా చూడాలి. ఆస్తమా ఇబ్బంది ఉన్నవారు చలిగాలి వీచే సమయంలో ఆరుబయట తిరగకూడదు. వ్యాధిని అదుపులో ఉంచే మందుల్ని క్రమం తప్పకుండా వాడాలి. శరీరమంతా ఉన్నిదుస్తులు కప్పుకోవాలి.



ముఖ్యంగా మంకీ క్యాప్, స్కార్ఫ్ తప్పకుండా ధరించాలి. వేడి పదార్థాలే ఆహారంగా తీసుకోవాలి. ఫ్యాన్ వాడకం తగ్గించాలి. చలి బాగా ఉంటే రూమ్‌హీటర్ వాడాలి. పడని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. దోమల కాయిల్స్ వాడటం మానేయాలి. నీటిని వేడి చేసి గోరువెచ్చగా తాగాలి. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది.



**చర్మసంరక్షణ చర్యలు తీసుకోవాలి**

చలికాలంలో చర్మం తెల్లగా పొడిబారకుండా ఉండడానికి గ్లిజరిన్ సబ్బులు వాడితే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనెతో మసాజ్ చేసుకుని తలస్నానం చేయాలి. వేడినీటితో స్నానం చేస్తే చర్మం పొడి బారుతుంది. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి. చలికాలంలో పాదాలు పగలడం ఎక్కువగా ఉంటుంది. ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటిలో పాదాలను పది నిమిషాలు ఉంచాలి. నీటిలో ఉంచిన తరువాత సబ్బుతో కడుక్కుని పొడిగుడ్డతో శుభ్రంగా తుడవాలి. పగిలిన చోట మాయిశ్చరైజర్ రాయాలి. విటమిన్-ఈ క్రీమ్ రాస్తే మంచిది. మధుమేహ వ్యాధిగ్రస్తులు డాక్టర్ల సలహాలు పాటించాలి. చలి నుంచి చర్మాన్ని రక్షించుకోవాలంటే క్రీమ్ బేస్ మాయిశ్చరైజర్లు రాసుకోవడం వల్ల చర్మం కోమలంగా మారుతుంది. వ్యాజలైన్, కొబ్బరినూనె లాంటివి స్నానం చేసిన వెంటనే శరీరానికి రాసుకోవాలి. జెల్ సబ్బులు వాడితే మంచిది. పిహెచ్ 7కు తక్కువ ఉన్న సబ్బులు చర్మాన్ని రక్షిస్తాయి. వారానికోసారి ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనెతో తలకు మసాజ్ చేసుకోవాలి. ఆ తరువాత తలస్నానం మేలు. గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి.

ముందుగా వైట్ ప్యారాఫిన్, పెట్రోలియం జెల్లీ, లిక్విడ్ ప్యారాఫిన్ లాంటి మాయిశ్చరైజర్స్ రాసుకుని స్నానం చేయడం మేలు. చలికి కళ్ల చుట్టూ దురద వచ్చే ప్రమాదం ఉంది. దీని నుంచి రక్షించుకోవడానికి విటమిన్ 'ఇ' క్రీమ్ రాయాలి. చలికి పెదాలు పగిలి, రక్తం కారే ప్రమాదం ఉంది. వెన్న, పేరిన నెయ్యి వంటివి మేలు.

ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన వ్యాజిలైన్ వంటివి కూడా ఉపయోగిస్తే మంచిది. చలికాలంలో ఎగ్జిమా లాంటి చర్మవ్యాధులు వచ్చే ప్రమాదముంది. నీరు కారి పొక్కులు వస్తాయి. ఇలాంటప్పుడు వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. చిన్నపిల్లలను, వృద్ధులను చలిలో తిప్పడం మంచిది కాదు. వీరు వెచ్చని దుస్తులు ధరించాలి. కొందరు బక్కెట్లకొద్దీ వేడినీళ్లతో స్నానం చేస్తుంటారు. దీనివల్ల శరీరంపై ఉండే కణాలు చనిపోతాయి. చర్మం ముడతలు బారుతుంది. అందుకే పది నిమిషాల కంటే ఎక్కువసేపు స్నానం చేయవద్దు. అదీ గోరువెచ్చని నీటితోనే చేయడం ఉత్తమం. రాత్రివేళల్లో బయట ఉండాల్సినవాళ్లు ఉన్నిదుస్తులు ధరించాలి. చలిలో ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే సమయంలో స్కార్ఫ్, జర్కిన్, హెల్మెట్, షూ, గ్లౌజ్‌లు వంటివి ధరించాలి. ఆస్తమా ఉన్నవారు చలికాలంలో నిత్యం వాడే మందులను సిద్ధంగా ఉంచుకోవాలి. దుమ్ము, ధూళి పనులకు దూరంగా ఉండాలి. చల్లని గాలిలో తిరగవద్ద. శ్వాసనాళాలు మూసుకుపోకుండా వైద్యుడి సలహా మేరకు మందులు వాడాలి. ఇన్‌హేలర్, నెబ్యులైజర్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలి. గుండెజబ్బులు ఉన్నవారు, గుండె ఆపరేషన్ చేయించుకున్నవారు వాకింగ్ చేయకూడదు.



**తీసుకోవాల్సి జాగ్రత్తలు**

చలిగాలులు వీస్తున్న సమయంలో ఇంటి తలుపులు, కిటికీలను మూసివుంచి చలిగాలులు



లోనికి రాకుండా చూడాలి. శరీరానికి వేడిని కలిగించే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఉదయంపూట వివిధ రకాల పనుల నిమిత్తం వెళ్లేవారు, పొలం పనులకు వెళ్లేవారికి చలి వల్ల కాళ్లు, చేతులు దురదలు పెడుతుంటాయి. వ్యాజిలిన్, చర్మక్రీములు రాసుకోవడం ఉత్తమం. శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా ఉండేందుకు పొడిదుస్తులను ధరించాలి. చలితీవ్రతతో జలుబు బాగా వచ్చి ఊపిరి తీసుకునే అవకాశం ఉండదు. అలాంటప్పుడు నెబ్యులైజర్ వినియోగించుకోవాలి. శ్వాసకోస వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. ఆస్తమా, టీబీ వ్యాధిగ్రస్తులు ఉదయం 8 గంటల వరకు సాయంత్రం 6 గంటల తరువాత బయటికి వెళ్లకూడదు. బయటికి వచ్చే సమయంలో మాస్కులు ధరించడం మేలు. గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే సమీప ప్రాంతాల్లోని వైద్య సిబ్బందిని ఆశ్రయించాలి. వేడి ఆహార పదార్థాలు, నీటిని స్వీకరించాలి. చిన్న పిల్లలకు న్యుమోనియా వచ్చే అవకాశాలు ఉంటాయి. చల్లటి వాతావరణంలో బయటకు వెళ్లకుండా చూడాలి. తగినన్ని నీళ్ల తాగాలి. చలికాలంలో చెమట రాదని చాలా మంది నీళ్లు ఎక్కువగా తాగరు. శరీరం సక్రమంగా పని చేయడానికి నీరు చాలా అవసరం.

అందుకే చలికాలంలోనూ నిత్యం 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి. నీళ్లు తక్కువగా తాగడం వల్ల జీర్ణ వ్యవస్థపై చెడు ప్రభావం కలిగిస్తుంది. చాలినన్ని నీళ్లు తాగి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడం అవసరమని వైద్యులు చెబుతున్నారు. ఎందుకంటే హైడ్రేషన్ వల్ల శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉండటమే కాకుండా రోగ నిరోధకత పెరుగుతుంది. చర్మం కాంతివంతగా ఉంటుంది. ఫలితంగా చర్మ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. ❑





# వీధి ఆవుల వ్యధ

సకల దేవతలను దేహంలో నిలుపుకున్న కల్పవల్లిగా
కోరిన కోరికలను ఈడేర్చు కరుణా కామధేనువుగా
హిందువుల పూజలందుకొనుచుండు నిత్యము.
పసిపాపల పొట్టలు నింపి పుష్టితోబాటు రోగనిరోధక
శక్తినిచ్చే ఆరోగ్యమయి దిగుబళ్లు పెంచేలా
పంటపొలాలకు పేడ రూపేణ
సత్తువ నందించే భూమాత చెలికత్తె తాను.
రైతుకు సేద్యంలో కుడియెడమ భుజాలైన
కాడెద్దులని కని ఇచ్చే స్నేహమయి
పల్లెసీమల్లో పచ్చని పంట
పొలాల్లో గట్లపై పచ్చని గడ్డి మేస్తూ
మనిషితో మమేకమై గ్రామసీమలను
సౌభాగ్యవంతం చేసిన అష్టలక్ష్మీ అవతారం తాను.
తన పాలు, నెయ్యి, పిడకలతో పూజా పునస్కారాలను
పరిపూర్ణం చేస్తూ యజ్ఞ యాగాదులందు
విప్రుని వెంట వెళ్లి దానఫలాన్ని అందించే ధన్యజీవి.
పల్లెలు పట్నం వచ్చెనో.. పట్నమే పల్లెలకేగెనో
కమ్మనైన పొదుగు పాలను కాదని
కల్తీ ప్లాస్టిక్ పొట్లాల పాలకు అలవాటు పడిన
గ్రామీణులు సుఖలోలులై మేపలేక
బద్దకించిరేమో!
ఆవులమంద నగరాల్లో రహదారుల పాలయ్యే!
రాకపోకలకు ఆటంకం కలగనీయక
సంస్కారంతో
బాట పక్కల చేరి నీటికి గ్రాసానికి అర్రులు
చాస్తూ
మెడపట్టీలు పగ్గాలు
ముక్కుతాళ్లు లేక తచ్చాడే దీన స్థితి కలిగే
ఆవును ఆవుగా గౌరవించక.. దాన్ని దేవతగా
పూజించి
ఈ స్థితికి తెచ్చే కుత్సిత బుద్ధితోడ
నరాధముడు
తామే ప్రధానమై ఉత్తర గోగ్రహణంతో
మహాభారత
గాథను మలుపు తిప్పిన ఆలమందకు
ఈ గతి పట్టించే నక్కజిత్తుల
నరరూప రాక్షసుడు
పొద్దుగూకు వేళ వాటిని తమ ఇంటివైపు తోలి
ఎండుగడ్డి, కుడితినీళ్లను
ఎరగా వేసి వాటి పాలను
తస్కరించి సొమ్ము చేసుకొనుచుండు.
చెత్తతిళ్లు తిని నగరవాసులు
పారేసిన కాగితాలు మింగి
అసువులు బాయుచుండు
ముష్కరుల చేత చిక్కి కబేళాలు చేరి
కర్కశ కోత యంత్రాల బారిన పడి అంతమవుచుండు
గోపాలకృష్ణయ్య మళ్లీ పుట్టాలేమో గోవులను
లాలించి పాలింపగా!

**- గడ్డం దేవీప్రసాద్**


## ఈ వారం కవిత్వం

# పుస్తకం

అజ్ఞానాన్ని పారదోలి
విజ్ఞానాన్ని అందించే
అక్షర భాండాగారం
పుస్తకం.
పఠితలకు ప్రాణప్రదమై,
విద్యార్థులకు విజ్ఞాన ఖనియై,
ఉద్యోగార్థులకు
జీవన గమనమై,
సంస్కృతి సంప్రదాయాలకు
వారధియై,
పుస్తకం ప్రేమికులకు
ప్రియ నేస్తమై,
మనో చాంచల్యంతో
కొట్టుమిట్టాడేవారికి
మనో వైజ్ఞానిక శాస్త్రవేత్తయై,
భావి భారతావనికి
బాసటగా నిలిచి,
ప్రాపంచిక జ్ఞానాన్ని అందించే
సామాజిక కార్యకర్తయై,
సమాజాన్ని
సంస్కరించే
సద్గురువై
పదిలంగా నిలిచేదే
పుస్తకం.

**- శిద్దే కవిత**





# పుస్తక సమీక్ష

## యువతకు చక్కటి సందేశాన్నిచ్చే పుస్తకం



కిరణ్ విభావరి కవయిత్రి, రచయిత్రి చక్కటి పరిచయం రాసారు. నిత్యమాసపత్రికలో ప్రచురించబడి ప్రశంసలు పొందిన నవల ఇది. డేటింగ్ యాప్స్‌లో తేలియాడే 'అభి' లాంటి యువకులు ఎందరో ఉన్నారు. అమూల్యమైన యవ్వనాన్ని/ కాలాన్ని వృధా చేసుకొనే యువత ఛాటింగ్- డేటింగ్స్‌లాంటి వాటితో ఎంతో ఎన్నో కోల్పోతున్నారు. ఈనవలలో వాప్లాగ్‌లో అభి వేలమందితో కాంటాక్ట్ పెట్టుకొనేవాడు. ప్రపంచ స్త్రీలను స్పృశ్యించాడు. చిన్న చిన్న ఉద్యోగాలతో, మెయిడ్ లాగా వెళ్లిపోతుంటారు. అభికి గర్ల్స్ చాట్‌యాప్‌లో ఛాట్‌చేస్తు శృంగార విషయాలు మాట్లాడుతూ హుషార్‌గా ఉంటాడు. నేత్ర, సవ్య, శ్రీపూర్ణ, లేఖి, స్వాతి, పల్లవి, వెన్నిమెలీనీనాలాంటి వారితో ఛాటింగ్ అనుభవం కోసం లాడ్జిలకెళ్లడం, శిల్ప, కిన్నెలలాంటి వాళ్లను కలవడం 'డబ్బు' తప్ప మరే ఉద్దేశ్యం లేని వారితో దూరంగా వెళ్లిపోవడం, ఇల్లు లేని తల్లి, చెల్లి ఆప్యాయత పొందటం ట్యాంక్‌బండ్ వద్ద తన ప్రియురాలు అనన్యను అభి కలవడంతో నవల ముగుస్తుంది. 'కట్టుకునే భార్యకి ఇదొకటి గిఫ్ట్‌గా ఇస్తే అది జీవితకాలం అన్యోన్యంగా ఉండేదుకు అవకాశం ఎక్కువ అని. ముద్దు, ముచ్చట్లు బయట సాగిస్తే ఆమెకి ఇచ్చేవి ఇక నీ దగ్గర ఏమి ఉండవు' అనే అభి స్నేహితుడు తన్మయ్ చెప్పిన మాటలు (పేజీ:74) అందరు యువతకు చక్కటి విలువైన గొప్ప సూచననే కదా' టీనేజ్ యువతను ఆకర్షించే నవల ఇది. **(ఒక మనసు అనేక దేహాలు, రచన: ఉండవిల్లి.ఎమ్, వెల: రూ100, ప్రతులకు: ఇ.నం.23-7-20, ఫ్లాట్: నం.305, శ్రీభాను అపార్టుమెంట్స్, దుగ్గిరాల వారి వీధి, కాకినాడ)**

**- తంగిరాల చక్రవర్తి**

## సామెతల కతలు



ఏ సమాజంలోనయినా 'సామెతలు' సాంఘిక జీవనంలో నిర్దిష్టమైన పాత్రను పోషిస్తాయి. సామెతల ద్వారా వ్యక్తులకు అనేక జీవిత సత్యాలను చమత్కార భరితంగా బోధించే వీలుంటుంది. తరతరాల జీవితానుభవాల సారం ఈ సామెతలు ప్రతిబింబిస్తాయి. ఒరకంగా చెప్పాలంటే సంక్షిప్త జీవితసత్యాలు సామెతలు. బిందుమాధవి 65 చక్కని సామెతలను ఎంచుకుని, ఆ సామెతలను విస్పష్టం చేస్తూ, సామెతలలో దాగి ఉన్న జీవిత సత్యాలను నీతులకు ప్రస్తుటం చేసేరీతిలో చక్కని చిన్న కథలను సృజించారు. వివరించేందుకు ఎంచుకున్న సామెతలు నిత్యజీవితంలో ఉపయోగించేవి.


'అడ్డాలనాడు బిడ్డలు కానీ, గడ్డాలనాడు కాదు', 'అతిసర్వత్ర వర్జయేత' 'అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి' 'ఇంగువ కట్టిన గుడ్డ', 'ఎంత చెట్టుకి అంతగాలి', 'చీమలు పెట్టిన పుట్టలు', చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు' వంటి బాగా కలిగిన ప్రచారంలో ఉన్న సామెతలను ఎంచుకుని వాటికి తగ్గట్టు చిన్న కథలకు అందంగా సృజించారు రచయిత్రి. ఇది ఒక చక్కని ప్రయోగం రచయిత్రి అభినందనీయురాలు.

**(సామెతల కతలు, రచన: బిందుమాధవి మద్దూరి, వెల: రూ150, ప్రతులకు: ఫ్లాట్‌నం. 402, శ్రీముఖ రెసిడెన్సీ, ఇ.నం.8-3-1027/2/ఎ, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్)**

**- నిర్మోహి**

## నేటి జనానికి తెలియాల్సిన నాటి సంస్కృతి

తెలంగాణ ప్రాంత సంస్కృతి బహుప్రాచీనమైనది. నీళ్లలో పాలులా, ఏ పరాయి సంస్కృతి ఎదురైనా అలజడికి లోనుకాకుండా, ప్రశాంతితో కలిసిపోయే విశిష్టత ఉంది. రాజరాజనరేంద్రుడి కాలం నుండి మరీ ముఖ్యంగా ఇటీవల ముస్లిం, పాశ్చాత్యుల పాలనలో ఈ సంస్కృతి సముద్రమంతటి మార్పులకు లోనయింది.




'అల్వీన్‌టాఫ్లర్' అనే పాశ్చాత్య పరిణామ పరిశోధకుని ప్రకారం ప్రపంచం శరవేగంగా ఊహకు అందనంతగా మారుతున్నది. అట్టి మార్పులకు తెలంగాణ ప్రాంతమేమీ 'మినహాయింపు' కాదు. ఈ గ్రంథరచయిత లక్ష్మణ్‌రావు పతంగే అధ్యాపక వృత్తిలో రిటైర్డ్ అయినా తన కుతూహలం వల్ల ఎన్నో కొత్త విషయాలను శోధిస్తున్నారు. ఉర్దూ, తెలుగు నిఘంటువు, హిందీ, ఉర్దూ జాతీయాలు విశ్లేషించి ఉర్దూ భాషపై లోతైన పరిశోధన చేసిన వారు. 2017 ప్రపంచ తెలుగు మహాసభల్లో పురస్కారగ్రహీతలు. ప్రస్తుత గ్రంథంలో 1947 కాలం నుండి తెలంగాణ ప్రాంతంలో వచ్చిన మార్పులు, గ్రామజీవనం, గృహోపకరణాలు, నివాసగృహాలు, వృత్తులు, సంచారజాతులు, పండుగలు, ఉత్సవాలు, ఆరోగ్యం, వైద్యం, రవాణా, వ్యాపారం, ప్రభుత్వ రంగాల్లో వచ్చిన మార్పులు వివరిస్తున్నారు. 70ఏళ్ల దాటిన వారికి జ్ఞాపకాలుగా నేటి యువకులకు నాటి కాల అవగాహనగా పనికి వచ్చే మంచి గ్రంథమిది. **(కనుమరుగవుతున్న తెలంగాణ సంస్కృతీ ఖజానా, రచన: లక్ష్మణ్‌రావు పతంగే, వెల: రూ 200, ప్రతులకు: ఇం.నం.18-1-292/ 47/బి/19, ఉప్పుగూడ, హైదరాబాద్)**

**- కూర చిదంబరం**

## 'ఒకప్పుడు' అలా..యిప్పుడు యిలా

కర స్పర్శ, చూపు, మాట..ఆ 'మాటల కవితల ఎంత భావం వుంటుందో/ ఎంత వేదన వుంటుందో/ అవగతం కావాలంటే/ శబ్దనిశ్శబ్దంలో/ ప్రయాణం చేయాల్సిందే' అంటున్నాడు రాజేందర్ జింబో. 'శూన్యం నుంచి శూన్యంలోకి ప్రయాణమే



జీవితం/ ప్రయత్నం కొనసాగుతుండగానే జీవిత చరమాంకం వస్తుంది'. మనం నిజంగా జీవిస్తున్న కాలం చాలా స్వల్పమని కవిభావం. 'వర్షం భూమికి గంధం చెక్క అవుతుంది. సూర్యుడికి డిటర్జెంట్ సబ్బు బిళ్ల అవుతుంది' నిజమే అనిపిస్తోంది కదా! 'ఎండాకాలం మిట్టమధ్యాహ్నం సూర్యుడిని తిరస్కరిస్తాం/ చలికాలం మధ్యాహ్నం సూర్యుడిని ఆహ్వానిస్తాం!' మనిషి నైజమే అంత! 'ఒకప్పుడు' ఒద్దనుకున్నది మరొకప్పుడు కావాలనిపిస్తుంది. 'ఇక్కడ అన్నీ అపరిచిత ముఖాలే/ ఈ అపరిచిత ప్రపంచంలో/ పరిచిత ముఖం ఒక్క అతని భార్యేనేమో!' ఇదీ gated community యిళ్లల్లోని నిర్వాసితుల పరిస్థితి. స్పర్శించాలనీ, ఒకరినొకరు కలుసుకోవాలనీ ఒకరితో మరొకరు మాట్లాడుకోవాలనీ, మనిషి తనలోకి తను తొంగి చూసుకోవాలనీ కవి జింబో కోరిక. యివన్నీ 'ఒకప్పుడు' వుండేవి..యాంత్రిక యుగంలో యిప్పుడు కరువైపోయాయని కవి ఆవేదన. రాజేందర్ కవితా సంపుటి 'ఒకప్పుడు' చదవడం ఓ గొప్ప అనుభవం. **(ఒకప్పుడు, రచన: రాజేందర్ జింబో, వెల: రూ 100, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్)** **- రమణ వెలమకన్ని**


మనుషులకేనా విడాకులు.. మాకు కూడా ఉంటాయంటున్నాయి పక్షులు. పక్షులు కూడా దాంపత్య సమస్యలతో సతమతమవుతున్నాయి. దీంతో విడాకులు తీసుకునే విషయంలో మనుషులు మాత్రమే కాకుండా పక్షులు కూడా స్ట్రగుల్ పడతాయి. కుటుంబ కలహాలతో పక్షి జంటలు విడిపోతున్నాయి. ఎంతో వేదన, వ్యథతో అవి విడాకులు తీసుకుంటాయి.



# అందమైన పక్షుల్లో దాగిన వ్యథలెన్నో..

ఈ రోజుల్లో పెళ్లి తర్వాత కొన్నాళ్లకు దంపతులు వివిధ కారణాల రీత్యా విడాకులు తీసుకోవడం సర్వసాధారణమై పోయింది. కొన్ని దేశాల్లో అయితే భార్యాభర్తల మధ్య చిన్నపాటి మనస్ప ర్థలు తలెత్తినా, విడాకులు తీసుకుని ఎవరికి వారు కొత్త జీవితాన్ని ప్రారంభి స్తుంటారు. ముఖ్యంగా అనుమానాలు, అక్రమ సంబంధాలతోనే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతోనే ఎక్కువ మంది విడాకులు తీసుకుంటు న్నారు. అచ్చం ఇలాగే పక్షులు కూడా ఇటువంటి అంశాలపైనే విడాకులు తీసుకుంటున్నాయనే విషయం తాజా పరిశోధనల్లో బయట పడింది. ప్రధానంగా సుదీర్ఘ ప్రాంతాలకు ప్రయాణించే పక్షుల్లో విడాకుల రేటు ఎక్కువట.

రుతువులను బట్టి దూర ప్రాంతాలకు వలసపోయే పక్షులు తిరిగి స్వస్థలాలకు చేరుకున్నప్పుడు పాత భాగస్వాములతో



విడిపోయి కొత్త వాటితో జత కదుతుంటాయి. పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించడం ద్వారా ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి చేరుకుంటాయి. తిరిగి వచ్చాక ఎక్కువ పక్షులు భాగస్వామి నుండి విడిపోతాయి. దీనికి కారణం ప్రధానంగా అనుమానమేనట. చైనాలోని 232 రకాల పక్షులపై జరిపిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. అధిక దూరం ప్రయాణించే పక్షుల్లో విరామం, విడాకుల రేటు చాలా ఎక్కువ అని చైనాలోని ఒక యూనివర్సిటీ పరిశోధకులు తేల్చారు. ఇవి ఆహారం, సంతానోత్పత్తి కోసం రెండు సార్లు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి వెళ్తుంటాయి. విడాకులు తీసుకుని విడిపోయిన తర్వాత కొందరు వ్యక్తులు ఆజన్మాంతం ఒంటరిగానే బతికేస్తుంటారు. మరికొందరు కొత్త భాగస్వాములతో మిగిలిన జీవితం కొనసాగిస్తారు. అచ్చం మానుషుల్లానే పక్షులు కూడా ఇలాగే ఉంటాయని పరిశోధకులు తేల్చారు. సాధారణంగా పక్షుల జనాభాలో 90 శాతం ఒకే భాగస్వామితో కలిసి ఉంటాయి. మిగిలిన 10 శాతం పక్షులు అనుమానాలు, అక్రమ సంబంధాలు, విభేదాలు, మన్పర్ధల

తోనే అప్పటి వరకూ కలిసి ఉండేవి విడిపోతుంటాయి. పాత భాగస్వాములతో విడిపోయిన పక్షులు కొత్త భాగస్వాముల కోసం వెతుక్కుంటాయి. ఇక సముద్ర పక్షులైన అల్బ్రట్రాస్‌లు అత్యంత ఏకస్వామ్య జీవులు. ఇవి తమ పార్టనర్‌తో జీవితాంతం సహజీవనం చేస్తాయి. 50 ఏళ్లకు పైబడి జీవించే ఈ పక్షులు సంతానోత్పత్తి కోసం రెండు సంవత్సరాలకు ఒకసారి ఒకే భాగస్వామితో మేటింగ్ చేస్తాయి. అయితే పిరికి లక్షణాలతో ఘర్షణకు దూరంగా ఉండే మగ వాటికి బ్రేకప్ చెప్పడం వాటిల్లో సర్వసాధారణంగా జరుగుతుంది. అంతేకాకుండా ఒక నిర్దిష్ట భాగస్వామితో సంతానోత్పత్తిలో సక్సెస్ రేటు చాలా తక్కువగా ఉన్నప్పుడు అవి మరొక పార్డనర్‌ను వెతుక్కుంటాయి. ఈ మేరకు 1959 నుండి దక్షిణ హిందూ మహాసముద్రంలోని క్రోజెట్ ద్వీప సమూహంలో గల పొసెషన్ ద్వీపంలో సంచరించే అల్బ్రట్రస్‌ల కాలనీని ట్రాక్ చేసిన శాస్త్రవేత్తలు కొన్ని పక్షుల కాలికి స్టెయిన్‌లెస్ రింగ్‌ను ఫిక్స్ చేశారు. ఇక ప్రతీ రెండేళ్లకోసారి పిల్లలను కనే ఈ పక్షులు వాటిని పెంచేందుకు ఏడాది సమయం తీసుకుంటాయి.



ఈ క్రమంలో కోల్పోయిన శక్తిని తిరిగి పొందేందుకు మరో ఏడాది పాటు విశ్రాంతి తీసుకుంటాయి. అప్పటివరకూ మగ పక్షులతో మేటింగ్ చేయవు. అలాగే ఫిమేల్ పార్టనర్స్ కంటే పిరికి లక్షణాలు గల మగ అల్బ్రాట్రాస్‌లకే విడుకులు తీసుకునే అవకాశాలు రెండు రెట్లు ఎక్కువని గుర్తించారు. ఇక జంటగా సంచరించే అల్బ్రాట్రాస్‌లలో రొమాంటిక్ ప్రక్రియలు ఉంటాయని, తమ రెక్కలను పైకి లేపి చప్పుడు చేస్తూ చుట్టూ నృత్యం చేస్తాయి. కొన్నిసార్లు ఈ ప్రక్రియలో ఇతర మగ పక్షులు ఆ జంటను విడదీసేందుకు ప్రయత్నిస్తాయి. అలాంటి సమయాల్లో భయంతో ఘర్షణకు దూరంగా ఉండే మగ పక్షులు విడాకులను అంగీకరిస్తాయని శాస్త్రవేత్తలు ధృవీకరించారు.

## పక్షుల సూసైడ్ పాయింట్ మిస్టరీ




కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ భారతదేశం ఎన్నో వింతలు, విశేషాలకు నిలయం. ఇక్కడ విచిత్రమైన ప్రదేశాలు కూడా ఉన్నాయి. అటువంటి ఒక ప్రాంతం అస్సాంలో ఉంది. ఆత్మహత్య చేసుకునే ధోరణి సహజంగా మనుషుల్లో అక్కడక్కడా కన్పిస్తుంది. కానీ పక్షుల్లో కూడా ఆత్మహత్యకు పాల్పడే లక్షణం అరుదుగా ఉంది. అది ఒక రకమైన పక్షులకు సూసైడ్ పాయింట్. అక్కడకు వేల పక్షులు వచ్చి ఆత్మహత్య చేసుకుంటాయి. ఇప్పటికే భారీ సంఖ్యలో పక్షులు మృత్యువాత పడుతున్నాయి. అక్కడ అసలు ఏం జరుగుతోంది, పక్షులు ఎలా మరణిస్తున్నాయనేది మాత్రం మిస్టరీగా మిగిలిపోయింది.

అస్సాంలోని జటింగా, టోరైల్ కొండల మధ్య జాతింగా అనే గిరిజన గ్రామాన్ని 'సూసైడ్ పాయింట్ ఆఫ్ బర్డ్స్' అని పిలుస్తారు. ప్రతీ ఏటా సెప్టెంబరు, నవంబరు నెలల మధ్య వేల సంఖ్యలో పక్షులు తరలివచ్చి మరణిస్తుంటాయి. ఈ ప్రాంతానికి పక్షుల ఆత్మహత్య కేంద్రం అని పేరు. ఈ గ్రామంలో పక్షులు గాలిలో ఎగురుతూ వేగంగా వచ్చి ఇళ్ల లేదా చెట్టుకు ఢీకొని తీవ్రంగా గాయపరచుకుంటాయి. అనంతరం అవి కిందపడిపోతాయి. ఆ తర్వాత అవి ఎగరలేక కొట్టుకుంటూ అల్లాడిపోతాయి. తదుపరి కాసేపటికే మరణిస్తాయి. విచిత్రం ఏమిటంటే ఈ పక్షులు రాత్రి గూళ్లకు చేరుకుంటాయి. సరిగ్గా రాత్రి 7 గంటల నుండి 10 గంటల మధ్యలో ఆత్మహత్య చేసుకునే సమయాన్ని కేటాయించుకుంటాయి. మిగిలిన సమయాల్లో మాత్రం బాగానే ఎగురుతూ కనిపిస్తాయి. దాదాపు 40 రకాల స్థానిక, వలస పక్షులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటాయి.

కొన్ని ప్రాకృతిక కారణాల వల్ల జాతింగా గ్రామానికి ఇతర నగరాలు, గ్రామాలతో కొన్నేళ్లుగా సంబంధాలు తెగిపోయాయి. రాత్రిపూట ఈ గ్రామంలోకి మనుషులు ప్రవేశించడంపై నిషేధం కూడా అమల్లో ఉంది. అందువల్ల రాత్రి సమయాల్లో ఈ గ్రామానికి ఎవరూ రారు. అయితే కొందరు మాత్రం ఇక్కడ అయస్కాంత శక్తి ఎక్కువ అని చెబుతున్నారు. చలికాలంలో పొగమంచు ఎక్కువగా పడుతుందని, దీనికితోడు గాలులు వేగంగా వీస్తాయని పేర్కొంటున్నారు. గాలులు వేగంగా వీయడం, చీకటి ఎక్కువగా ఉండటంతో స్పష్టంగా చూడలేక ఇళ్ల, చెట్లను పక్షులు ఢీకొంటున్నాయని చెబుతున్నారు. కానీ గ్రామస్తుల కథనం మాత్రం మరోలా ఉంది. ఈ గ్రామంలో ఏదో దుష్టశక్తి ఉందని, అది పక్షులను బతకనివ్వదని నమ్ముతారు. ఏది ఏమైనా అసలు పక్షులు అక్కడకు వచ్చిన ఎందుకు ఆత్మహత్య చేసుకుంటాయనే విషయం శాస్త్రవేత్తలకు అంతుచిక్కనిగా మిగిలిపోయింది.

## పక్షుల్లో మైండ్ సీక్రెట్

గాఢ నిద్రలో ఉన్నప్పుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడం సాధారణంగా జరుగుతుంది. అంటే నిద్రపోయేటప్పుడు స్పృహ ఉండదు. నిద్రలో మంచం మీద నుండి తరచూ కింద పడిన అనుభవాలు కూడా ఎందరికో ఉన్నాయి. ఐతే చెట్ల కొమ్మలపై నిద్ర పోయే పక్షులు మాత్రం నిద్రపోయేటప్పుడు పక్షులు చెట్లపై నుండి ఎందుకు కిందకు పడవో మనకు తెలియదు. అదే పక్షులకుండే మాస్టర్ మైండ్ సీక్రెట్. మనం పడుకోగానే కొంత



సమయానికే గాఢ నిద్రలోకి జారుకుంటాం. ఆ తర్వాత కలలు కంటాం. అయితే మనలాగే పక్షులు కూడా గాఢ నిద్రలోకి వెళతాయి. వాస్తవానికి పక్షులు చెట్ల కొమ్మలపై నిద్రిస్తున్న సమయాల్లో ఎందుకు పడవనే దానిపై పరిశోధనలు జరిగాయి. పక్షులు నిద్రపోయేటప్పుడు ఒక కన్ను తెరచి నిద్రపోతాయి. పక్షి మెదడులోని ఒక భాగం అంటే ఎడమ లేదా కుడి అర్ధగోళం నిద్రలో చురుకుగా ఉండే విధంగా నియంత్రిస్తుంది. మెదడు చురుకుగా ఉంటే ఒక కన్ను తెరిచి ఉంటుంది. అంటే ఒక వైపు కన్ను చురుగ్గా ఉంటుంది. మరోవైపు నిద్రపోతుంది. ఈ విధమైన నిద్ర సామర్థ్యం కారణంగా పక్షి నిద్రపోతున్నప్పుడు కూడా ఏదైనా ప్రమాదం నుండి తనను తాను రక్షించుకోగలదు. నిద్రపోతున్నప్పుడు చెట్టు మీద నుండి జారి పడకపోవడానికి ఒక ప్రధాన కారణం కూడా ఇదే. మరో కారణం ఏమంటే– పక్షుల పాదాల ఆకృతి, నిర్మాణం ఒక వస్తువును గట్టిగా పట్టుకోగలిగేలా ఉంటుంది. నిద్రపోతున్నప్పుడు వాటి పాదాల వేళ్లు చెట్టు కొమ్మలను గట్టిగా బిగించి, తాళం వేసినట్లు పట్టుకుంటాయి. అందుకే నిద్ర సమయంలో కూడా పక్షులు చెట్లపై నుండి కిందకు పడవు.

**- సిహెచ్.వి.వి.రఘుబాబు**

కథ

# తప్పు తెలిసింది

రామాపురంలో రాము, శ్యాము అనే ఇద్దరు బాలురు వున్నారు. ఇద్దరు ఒకే ఈడువాళ్లు. ఒకే బడిలో ఒకే తరగతి చదువుతున్నారు. ఇద్దరు మంచివాళ్లు, మంచి స్నేహితులు. ఇద్దరూ చదువులో పోటీ పడ్తూ చదివి, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేవాళ్ళు..

అయితే ఈ మధ్యన శ్యాము చెడ్డవాళ్ల స్నేహం మొదలుపెట్టి, తరచూ ఏది పడితే అది కొనుక్కుని తింటూ, సినిమాలు, షికార్లతో కాలక్షేపం చేయసాగాడు. ఫలితంగా శ్యాముకి తక్కువ మార్కులు వచ్చేవి.



బడి మానేయకుండా, చెడు స్నేహాలు చేయకుండా, బాగా చదువుకోమని రాము ఎన్ని సార్లు చెప్పినా శ్యాము వినిపించుకోకుండా అలాగే ప్రవర్తించసాగాడు.

ఒకరోజు రాము నోట్సు కొనుక్కుందామని వంద రూపాయలు తెచ్చుకొని జేబులో నుండి తీసి బ్యాగ్‌లోని పుస్తకంలో పెట్టుకోవటం శ్యాము చూసాడు.

రాముకి తెలియకుండా శ్యాము వాటిని కాజేసాడు.

బడి వదిలాక ఇంటికి వెళ్తూ రాము బుక్ షాపు దగ్గర ఆగి, నోట్స్‌లు కొనుక్కుందామని బ్యాగ్‌లోని పుస్తకాల్లో ఎంత వెతికినా వంద రూపాయలు కనిపించలేదు. రాము బిక్కముఖం వేసుకొని, అంతులేని బాధతో ఇంటికి వెళ్లాడు.

ఒక రోజున శ్యాము ఇంటి దగ్గర కాజేసిన పది రూపాయలు జేబులో పెట్టుకొని బజ్జీల బండి దగ్గరకి వెళ్లి, బజ్జీలు కొనుక్కుందామని జేబులో చెయ్యి పెడితే పది రూపాయలు లేవు. జేబుకి చిల్లు వుంది. జేబుకి చిల్లు వున్న సంగతి చూసుకోకుండా, పది రూపాయలు జేబులో పెట్టి, పోగొట్టుకున్నందుకు శ్యాముకి చాలా బాధ కలిగింది.

"నేను పది రూపాయల భాగ్యానికే ఇంత బాధ పడ్తున్నాను. వంద రూపాయలు పోయినందుకు రాము ఎంత బాధ పడ్డాడో! నేను చాలా తప్పులు చేస్తున్నాను. ఇప్పుడు నా తప్పు తెలిసింది. ఇకనుంచి ఎప్పుడూ తప్పులు చేయకూడదు. రాము మంచి స్నేహితుడు. రాముని బాధపెట్టటం చాలా తప్పు. రామునే కాదు, తప్పులు చేసి ఎవరినీ బాధపెట్టకూడదు. రాము చెప్పినట్లు మంచిగా నడచుకోవాలి" అని మారిన మనసుతో రోజూ శ్యాము బుద్ధిగా బడికి వెళ్తూ, చక్కగా చదువుకుంటూ రాము మెప్పు పొందాడు.

కొద్ది రోజుల్లోనే రాము డబుబలు ఇచ్చేసి, క్షమాపణలు చెప్పి రాముకి శ్యాము మరింత ఆప్తుడయ్యాడు.

**- మా.శ్రీ.రాజు**

## రంగులు వేయండి..






## బాలగేయం

### గురువులకు వందనం

చదువులు చెప్పే
గురువులందరికీ వందనం
సకల జ్ఞానాన్ని
జీవనదిలా పారించే
గురువులందరికీ వందనం
పాదాభివందనం.
నేటి బాలలే
రేపటి పౌరులుగా
తీర్చిదిద్దే
గురువులందరికీ వందనం
పాదాభివందనం.
అలుపెరుగక అనునిత్యం
విజ్ఞానపు జ్యోతులనిచ్చే
గురువులందరికీ వందనం
పాదాభివందనం.
మంచి చెడులను
తెలియజెప్పి
భవిష్యత్తుకు బాటలు వేసే
గురువులందరికీ వందనం
పాదాభివందనం.
విద్యామృతపు
ఊటలనందించి
రంగుల లోగిలై విలసిల్లే
గురువులందరికీ
వందనం
పాదాభివందనం.

**- సింగిడి శ్రీనివాస్**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.ప్రార్థన,** కొత్తగూడెం

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నిద్ర లేకపోతే కళ్లు ఎర్రగా కనిపిస్తాయి..ఎందువల్ల?**

**జవాబు: ప్రార్థన!** మనకు కనిపించే దృష్టి వెనుక కండరాల చర్య ఎంతో ఉంది. మన కంటికి కనిపించినంత మేరలోని వస్తువులపై దృష్టిని కేంద్రీకరించడానికి కండరాలు అవసరం. మనం ఒక వస్తువు మీద దృష్టిని ఏకాగ్రతగా ఉంచినప్ప టికీ కన్ను స్థిరంగా ఉండక చిన్న చిన్న కదలికలు చేస్తుంది. ఈ చర్యను కొనసాగించ డానికి, కండరాలకు శక్తినివ్వడానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేసేందుకు కంటిలో కేశనాళికల నెట్‌వర్క్ ఉంటుంది. ఈ కండరాలు అలసిపోయినప్పుడు లేక నిద్రలేమి కారణంగా ఎక్కువగా శ్రమించినప్పుడు అదనపు ఆక్సిజన్ చేరడానికి అధిక రక్తం సరఫరా అవసరమవుతుంది. ఈ అదనపు రక్తం సూక్ష్మమైన కేశనాళికల గుండా ప్రవహించినప్పుడు, కేశనాళికల నెట్‌వర్క్ ఎరుపు రంగుకు మారుతుంది. అందువల్ల రాత్రిపూట నిద్ర లేనివారి కళ్లల్లో ఎరుపు జీరలు కనిపిస్తాయి.

**- కె.అయాన్,** అవనిగడ్డ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే.కంప్యూటర్‌ను అతిగా చూస్తే కంటిచూపు దెబ్బ తింటుందా?**

**జవాబు: అయాన్!** కంప్యూటర్‌ను ఉపయోగించడం వల్ల కంటిచూపుకు ఏ విధంగానూ హాని ఏర్పడదు. ఏకబిగిన గంటల తరబడి స్క్రీన్ మీద తదేకంగా చూస్తూ పని చేయడం వల్ల కళ్లు బాగా అలసిపోవడం, కంటినొప్పి, తద్వారా తలనొప్పి వంటివి రావడం జరిగే అవకాశం వుంది. స్క్రీన్ వైపుగా ట్యూబ్‌లైట్ ను ఏర్పరచి లైటింగ్‌ను సర్దుబాటు చేయడం ద్వారా కంప్యూటర్‌తో పని చేయవచ్చు. టీవీ చూసేటప్పుడు కనీసం పది అడుగుల దూరం నుంచి చూడాలి. కనీసం గుడ్డి వెలుతురులోనైనా చూడాలి. కంటిచూపు మందగించకుండా 'ఐ ఎక్సర్‌సైజ్' చేయడం అన్ని విధాలా మంచిది.





గుంటూరు జిల్లాల్లో ఎన్ని పంటలు పండుతున్నప్పటికీ ముందుగా గుంటూరు మిరపకాయలు గుర్తుకొస్తాయి. అలాగే ఆలయాల గురించి మాట్లాడుకుంటే వెంటనే అమరావతి, కోటప్పకొండ అందరి మనసుల్లో మెదలుతాయి. ఒకప్పుడు విద్యకు పేరొందిన గుంటూరు పట్టణంలో ఎన్నో పురాతన ఆలయాలున్నాయి. అలాంటి వాటిల్లో పాత గుంటూరులో ఉన్న శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం ఒకటి. కృత యుగంలో సప్త మహర్షులలో ఒకరైన శ్రీ అగస్త్య మహర్షి ప్రతిష్ఠించారని స్థల పురాణం వల్ల తెలుస్తోంది.



ఆలయ దర్శనం

# అగస్త్యుడు ఆరాధించిన అగస్తేశ్వరుడు

**దక్షిణ** భారతదేశంలోని అనేక పరమేశ్వరుని ఆలయాలలోని ప్రధాన లింగాలు ఈ మహాముని ప్రతిష్ఠించినవే. కైలాస వాసుని కళ్యాణం కళ్లారా చూద్దామని ప్రజలందరూ ఉత్తర భాగానికి తరలి వెళ్లడంతో భూ భారం పెరిగి కుంగిపోసాగిందట.

అదే సమయంలో తాను మేరు పర్వతం కన్నా గొప్పవాడిని అనిపించుకోవాలని వింధ్య పర్వతం విపరీతంగా పెరిగిపోవడంతో ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు రాకపోకలలో, సూర్య చంద్ర గమనానికి అంతరాయం కలగసాగింది.

అప్పుడు మహేశ్వరుడు అగస్త్యుని పిలిచి శిష్యులతో కలిసి దక్షిణ భాగానికి వెళ్లమని ఆదేశించారట. తనకు శివ కళ్యాణ వీక్షణ భాగ్యం లేదా అని బాధపడిన ఋషికి 'అతనెక్కడ ఉన్నా అక్కడి నుండే తన వివాహ ఘట్టాన్ని కళ్లారా చూడగలడు' అనే వరం ప్రసాదించారు పన్నగభూషణుడు.

అలా బయలుదేరిన అగస్త్యుడు వింధ్యను చేరగా– పర్వతరాజు మహామునికి గౌరవ సూచనగా వంగి నమస్కరించాడు. సంతసించిన ఆయన తాను తిరిగి వచ్చేవరకు అలానే ఉండమని ఆదేశించారట.



అప్పటివరకు "కుంభ సంభవుడు" అని పిలవబడే మహర్షి పర్వతాన్ని నేలకు తెచ్చినవాడని అర్థం వచ్చేలా 'అగస్త్యుడు' అని పిలవబడసాగాడు.

తన పర్యటనలో వివిధ ప్రాంతాలలో నిత్య దైవతార్చన కోసం అక్కడ లింగాన్ని స్థాపించుకొనేవాడు. అవన్నీ ఇప్పుడు ప్రముఖ శైవ క్షేత్రాలుగా పేరొందాయి. ఈ ఆలయం ఆ కోవలోనిదే!

గుంటూరు బస్టాండ్ వెనుక జండా చెట్టుకు దగ్గరలో ఉంటుందీ ఆలయం. ఎలాంటి విరాట్ నిర్మాణాలు కనిపించవు. నూతనంగా నిర్మించిన ప్రవేశ ద్వారంపైన శ్రీ పార్వతీ సమేత పరమేశ్వరుని విగ్రహాలను చిన్న మండపంలో నిలిపారు.

విశాల ప్రాంగణంలోకి ప్రవేశించగానే కుడి వైపున శ్రీ కామాక్షిదేవి, శ్రీ ఏకాంబరేశ్వర స్వామి ఉపాలయం ఉంటుంది. ఇక్కడి మండప స్తంభానికి 'నాగ' లిపిలో లిఖించబడిన శాసనం కనపడుతుంది. దీనిని పదో శతాబ్ద కాలంలో ఈ ప్రాంతాన్ని పాలించిన "వేంగి చాళుక్య వంశానికి చెందిన అమ్మిరాజు" వేయించినట్లుగా చరిత్రకారులు నిర్ధారించారు. తరువాతి కాలంలో ఈ ప్రాంతాన్ని పాలించిన వివిధ రాజ వంశాలు ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేసినట్లుగా తెలుస్తోంది.

ఎడమ వైపున శ్రీ అష్ట భుజ వీరభద్రస్వామి ఆలయం ఇటీవల కాలంలో నిర్మించారు. పక్కనే ఉన్న మరో పురాతన మండపంలో జగద్గురు శ్రీశ్రీ ఆది శంకరుల మందిరం, నవగ్రహ మండపం ఉన్నాయి.

విశాల ప్రదక్షిణా ప్రాంగణంలో కళ్యాణ మండపం, జమ్మిచెట్టు, నాగ ప్రతిష్ఠలు, హరిహర సుత శ్రీ అయ్యప్పస్వామి

ఆలయాన్ని దర్శించుకోవచ్చు. ప్రధాన అర్చామూర్తులు కొలువుదీరిన గర్భాలయాల మీద సుందర చెక్కడాలు ఉంటాయి.
తూర్పు దిశగా ధ్వజస్తంభం, పురాతన నంది మండపం ఉన్నాయి. మండపంలో చాలా నందీశ్వరులు ఉంటారు. పురాతన నిర్మాణాలైన నమస్కార మండపం, అర్ధ మండపం దాటిన తరువాత వుండే గర్భాలయంలో లింగరాజు చందన కుంకుమ, విభూతి లేపనాలతో అలంకరించబడి భక్తుల అర్చనలు, పూజలు, అభిషేకాలు స్వీకరిస్తుంటారు. దక్షిణ దిశగా ఉన్న మరో సన్నిధిలో అమ్మవారు శ్రీ పార్వతీదేవి చక్కని అలంకరణతో ప్రసన్న వదనంతో కొలువై వుంటారు. ప్రతిరోజూ స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు జరుపుతారు. సోమవారాలు, మాస శివరాత్రి, అమావాస్య, పౌర్ణమి రోజులలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలలో పాల్గొంటారు.



కార్తిక మాసంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ఆలయంలో శివరాత్రి, నవరాత్రులు, గణేశ చతుర్థి పండగలు విశేషంగా నిర్వహిస్తారు. కార్తిక, ధనుర్మాసాలలో శబరి కొండకు వెళ్లే దీక్షాస్వాములు అయ్యప్ప భజనలు ప్రతిరోజూ చేస్తారు. పౌరాణిక, చారిత్రక విశేషాలకు సాక్ష్యంగా పాత గుంటూరు శివాలయాన్ని పేర్కొనవచ్చు. గుంటూరు పట్టణంలో మరెన్నో పురాతన, విశేష ఆలయాలు ఉన్నాయి.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

# వంటల రుచులు

## ఉసిరి పచ్చడి



### కావాల్సిన పదార్థాలు

ఉసిరికాయల తురుము – ఒక కప్పు; కొత్తిమీర–ఒక కప్పు; పచ్చిమిర్చి తరుగు–ఒక టేబుల్ స్పూను; అల్లం తురుము–అర టీ స్పూను; జీలకర్ర–అర టీ స్పూను; ఇంగువ–పావు టీ స్పూను; నల్ల ఉప్పు–పావు టీ స్పూను; బెల్లం–కొద్దిగా; ఉప్పు–సరిపడినంత; నీళ్లు–కొద్దిగా

### తయారు చేసే విధానం

ఉసిరికాయల గింజలు తీసేసి ముక్కలు తరగాలి. వాటిని మిక్సీ జార్‌లో వేయాలి. అందులో కొత్తిమీర, పచ్చిమిర్చి తరుగు, అల్లం తురుము, జీలకర్ర, ఇంగువ, నల్ల ఉప్పు, పంచదార, ఉప్పు వేసి కొన్ని నీళ్ల పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. రుచికి పుదీనా కూడా కలుపుకోవచ్చు.



## గోంగూర పులుసు

### కావలసిన పదార్థాలు

గోంగూర ఆకుల తరుగు–రెండు కప్పులు; సెనగపప్పు–పావు కప్పు(అరగంటసేపు నానబెట్టుకోవాలి); చిన్న ఉల్లిపాయలు–పది; పచ్చిమిర్చి–అయిదు; పసుపు–పావు స్పూను; జీలకర్ర–ఒక స్పూను; ఆవాలు ఒక స్పూను; ఎండుమిర్చి–నాలుగు; కారప్పొడి–రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు–తగినంత; నూనె–రెండు



టేబుల్ స్పూన్లు.

### తయారు చేసే విధానం

ఓ గిన్నెలో గోంగూర ఆకుల తరుగు, ఉల్లిపాయలు, సెనగపప్పు, పచ్చిమిర్చి తీసుకుని అవి మునిగేలా నీళ్ల పోసి స్టౌ మీద పెట్టాలి. గోంగూర, సెనగపప్పు ఉడికాక తగినంత ఉప్పు, పసుపు, కారం వేసి బాగా కలిపి సిమ్‌లో పెట్టాలి. స్టౌ మీద కడాయి పెట్టి నూనె వేసి ఆవాలు, ఎండుమిర్చి, జీలకర్ర వేయించుకుని పులుసుతో వేసి చిక్కగా అవుతున్నప్పుడు దింపేయాలి. ❐

కథ

# ఇష్ట కామ్యార్థ సిద్ధిరస్తు


శివలెంక ప్రసాదరావు

నీలిమ మనసు మబ్బుల్లో విహరిస్తోంది. పక్కన మురళి ఉండటమే అందుకు కారణం. గాలిని చీల్చుకుంటూ బస్సు ముందుకు పోతోంది ఒక మేటి ధనుర్ధారి వదిలిన బాణంలా.

మురళి భుజం తన భుజానికి తాకుతోంది.

కిటికీ నుండి వీస్తున్న గాలులకు ఆమె ముంగురులు చెదిరి అల్లరిగా మురళి ముఖాన్ని తాకుతున్నాయి. ఆమె మనసులో కోరికల్లా తలలో పూలు వాసనలు వెదజల్లుతున్నాయి.

నీలిమ ముఖంలో నవ్వులు వింత కాంతితో మెరుస్తున్నాయి. బస్సు అరకు దారిలో ప్రకృతి వెంట పరుగులు తీస్తోంది.



బస్సులో చాలా కళ్లు నీలిమ వైపు చూస్తున్నాయి. తెల్లటి మృదువైన శరీరం, ముద్దొచ్చే పెదవులు, ముక్కుపుడక అందంగా మెరుస్తోంది.

నీలికొండలపై తెల్లటి మబ్బులా నీలిమ.

నీలాకాశంలో నిండు చందమామలా నీలిమ.

మురళి కిటికీ నుండి బయటకు ప్రకృతి అందాలను చూస్తున్నాడు.

ఎవరి ఆలోచనల్లో వాళ్లు.

తను ఒప్పుకుంటే నీలిమ తన సొంతం అవుతుంది. కానీ తను ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడు.

నటనలు.. ద్వంద్వ ప్రవృత్తులతో నిండిపోతున్న సమాజంలో తన ఆదర్శాన్ని నిలబెట్టగలడా? పెళ్లి అనేది తనకు బందిఖానా అవుతుంది కదా.

పెళ్లి చేసుకొని కేవలం భార్యా పిల్లల అవసరాలే లక్ష్యంగా తను బతకలేడు.

మురళి ఈ ఆలోచనలలో ఉండగా బస్సు సడన్ బ్రేక్‌తో ఆగింది.

ఆ వేగానికి ఒకరి మీద ఒకరు పడ్డారు.

నీలిమ నవ్వింది.

బస్సంతా ఆ నవ్వులు వెలిగాయి.

మురళి సర్దుకుని కూచున్నాడు.

"మురళీ, ఆ నీలి కొండల అందం చూడు. పచ్చటి చేలు, పచ్చిక బయళ్లు, కొండవాగులు, నీతో కలిసి అక్కడ ఆడుకోవాలి" అని గుసగుసగా అతని చెవిలో చెప్పి అతనిపై ఒరిగిపోయింది.

సున్నితమైన ఆమె శరీరంలో ఒక భాగమంతా అతనికి హత్తుకుపోయింది. తెల్లటి నునుపైన మెడపై సన్నటి బంగారు గొలుసు తళుక్కున మెరిసింది.

నీలిమ అతని చేతివేళ్లలో తన వేళ్లు దూర్చి బిగించి పట్టుకుంది. తెల్లని పొడవైన ఆమె చేతివేళ్లు అతనికి ఏవో రహస్యాలు చెప్తున్నాయి.

కానీ మురళిలో చలనం లేదు.

"మురళీ! ఏమాలోచిస్తున్నావు?" బుంగమూతి పెట్టి ముద్దుగా అంది నీలిమ.

"నీలూ! అటు చూడు. రోడ్డులో ఇసుకలో ఏడుస్తున్న ఆ పిల్లవాడిని చూడు. డొక్కలెండుకుపోయి ఏడుస్తున్నాడు. గంజి కూడా లేని ఎందరో అనాథల రోదనలు నాకు వినిపిస్తున్నాయి. ఇలాంటివాళ్ల కోసం ఏదైనా చెయ్యాలి" మురళి స్థిరంగా అన్నాడు.

నీలిలో కళ్లల్లో ఆశ్చర్యం. గత మూడు సంవత్సరాలుగా అతని వెంట పడుతున్నా అతడు ఏ రోజూ బయట పడలేదు. ఈ టూర్‌లో మురళి మనసులో ఏముందో తెలుస్తుందా?

చిన్నగా జల్లులు పడసాగాయి. పచ్చటి చేల నుండి వస్తున్న గాలితో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. బస్సుతో పోటీ పడినట్టు నల్లటి మబ్బులు పరుగులు తీస్తున్నాయి.

నీలిమ మురళీ భుజంపై తల వాల్చి గట్టిగా అతన్ని పట్టుకుంది. వర్షపు జల్లులు వారి ముఖాన్ని తడపసాగాయి. మురళి కిటికీ అద్దాలు ముయ్యబోతుంటే ఆమె వద్దంది.

బస్సు ఆ ప్రేమికురాలి చొరవలా ముందుకు పోతోంది.

"మురళీ! బస్సు దిగి పోదాం. ఈ జల్లులో ఒకరి చెయ్యి ఒకరు పట్టి తడుస్తూ ఈ ప్రకృతిలో తిరుగుదాం. నీ ఒడిలో నేను నా ఒడిలో నువ్వు.. కౌగిలిలో ఒకరికి ఒకరం. నడిచి నడిచి ముద్దయ్యి.. ముద్దు అయ్యి విశ్వ రహస్యాలు శోధిద్దాం. ఆమె కళ్లలో కోరికల కలలు.. అలలు అలలుగా సాగుతున్నాయి. అతన్ని ఒక మోహంలో ముంచుతున్నాయి.

..అయినా బింకంగా ఉన్నాడు. తనలో తానే మోయలేని బరువులు మోసుకుంటూ ముడుచుకుపోతున్నాడు.

బస్సు ఒక గిరిజన గ్రామంలో ఆగింది. ఒకామె బస్సు ఎక్కింది.

నెలలు నిండినట్టు పొట్ట ఎత్తుగా కనిపిస్తోంది. పైగా చంకలో ఒక పిల్లాడు ఉన్నాడు.

కూర్చోవడానికి సీట్ లేదు. బస్సు కదలికలకు అటు ఇటు ఊగుతూ కష్టంగా నిలబడింది. చంకలో పిల్లాడు జారిపోతున్నాడు.

మురళి ఆమె పరిస్థితి గమనించి నీలిమ పక్క నుండి లేచి "రామ్మా! ఇక్కడ కూర్చో" అన్నాడు.

ఆమె కృతజ్ఞత చూపి నీలిమ పక్కన కూర్చుంది. నల్లటి ఒళ్లు.. తలస్నానం చేసి ఎన్నాళ్లయిందో.. అదోలాంటి వాసన ఆమె నుండి వస్తోంది. మురళి తన పక్క నుండి లేవగానే నీలిమకి షాక్. ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మురళికి నీలిమ పరిస్థితి అర్థం అవుతోంది.

"నీలూ! ఆ పిల్లాడిని నువ్వు నీ ఒడిలో కూర్చోబెట్టుకో.... గర్భవతి కదా" అన్నాడు. నీలూ అనే అతని పిలుపుతో నీలిమలో ఆనందం. గిరిజన పిల్లాడిని ఒడిలోకి తీసుకుంది. బోసినోటితో నవ్వుతూ ఆ పిల్లవాడు నీలిమ ఒడిలో ఆడుకోసాగాడు. మురళి నవ్వాడు.

అరగంట తర్వాత బస్సు అరకు చేరింది. ముందుగా రిజర్వ్ చేసుకున్న రూంకి చేరారు. రూమ్ కిటికీ తెరిస్తే ప్రకృతిఅందాలు కనిపించాయి. 'ఆకులో ఆకునై' అంటూ నీలిమ పాడింది. "చాలా బాగా పాడావు.." అని మురళి ఆమె స్వరాన్ని మెచ్చుకున్నాడు.

నీలిమ మనసులో ఆనందం.

మురళి స్నానం చేసి వస్తానని బాత్‌రూమ్‌కి వెళ్లాడు.

సోఫాలో కూర్చొని మురళితో తను ఏం చెప్పాలా అని ఆలోచిస్తుండగా మురళి బయటకు వచ్చి బట్టలు మార్చుకున్నాడు.

"నువ్వు ఫ్రెష్ అవు, నేను అరగంటలో వస్తాను" అని బయటకు వెళ్లిపోయాడు. ఆమె బాత్‌రూమ్‌లోకి నడిచింది. ఒంటిపై బట్టలు ఒక్కొక్కటి విప్పి షవర్ కింద నిలబడింది. ఎద గిరులు, మెడ వంపు, నాభి సొంపు, గుండ్రటి అవయవాలు.. అన్ని అవయవాలు సంపూర్ణ ఆకృతిలో ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ అందాలను మురళి కాదంటే ఇక ఇవి ఉండి ఏం ప్రయోజనం.. ఇపుడు మురళి బాత్‌రూమలోకి వస్తే తన అందాలను విందులుగా అతనివ్వదా.. ఆలోచిస్తూ ఊహాల్లో తేలియాడుతూ స్నానం ముగించింది.

తెల్ల చీర, మేచింగ్ బ్లౌజ్, నుదుట బొట్టు, కోరికను పెంచే పెర్ఫ్యూమ్.. తల నిండా మల్లెలు అలంకరణలో నీలిమ అప్సరసలా ఉంది. కోరికలను ఉద్దీప్తం చేసే వెన్నెల కొలిమిలా శరీరాన్ని కాలుస్తోంది. గాలి చల్లగా వేస్తున్నా మనసు తాపంగా ఉంది. ఈ చల్లని వెన్నెల రాత్రి తాను విరహంతో ఉంటే ఏడీ తన ప్రియ వల్లభుడు... మురళి వచ్చేవరకు వెయిట్ చేయలేక కనిపించే బాటలో అడుగులు వేసింది.

వెన్నెల వెలుగులో బాటకి దగ్గర్లో ఒక పెద్ద చెట్టు.

రెండు ఆకారాలు.

అందులో ఒక ఆకారాన్ని వేల మందిలో కూడా గుర్తు పట్టగలదు. రెండో వారెవరు? వడి వడిగా ముందుకు నడుస్తుంటే మురళి మాట వినిపించింది.

"స్వామీ, శారీరక ఆకర్షణ నుండి, ఇంద్రియ వాంఛల నుండి బయట పడే మార్గం చెప్పండి.."

మురళి మాట విని నీలిమలో ఏదో ఉద్వేగం. సమీపంలో మరో చెట్టును దాటు చేసుకొని వారి మాటలు వింటోంది.

స్వాములవారి నవ్వు వెన్నెల్లో తళుక్కుమంది.

"నాయనా, శారీరక ధర్మం ప్రకారం ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలి. నైతిక విలువలకు లోబడి ఇంద్రియ వాంఛలు అనుభవించాలి"

"స్వామీ, భార్య, పిల్లలు అనే బంధంలో నేను ఇరుక్కోలేను. సమాజాన్ని చైతన్యం చేయాల్సిన మనుషులు కేవలం నేను నా కుటుంబం అని గిరి గీసుకొని ఉండడం స్వార్థంగా నాకు తోస్తోంది"

"పొరపాటు నాయనా, కుటుంబం బందిఖానా కాదు. అది ఒక మమతల వలయం. బంధనాలు అనుకోవడం మంచిది కాదు. స్వామివారి చిద్విలాసం.."

మురళి కొన్ని సెకన్ల మౌనం తర్వాత అన్నాడు.

"స్వామీ! నాకు వివాహం అంటే భయం వేస్తోంది. కానీ ఈ మధ్య నా స్నేహితురాలి ఆలోచనలు నాలో కలవరం సృష్టిస్తున్నాయి"

మురళి మాటలు విని స్వామివారు నవ్వారు.

"స్వామీ! నాకు వివాహం అంటే భయం వేస్తోంది. కానీ ఈ మధ్య నా స్నేహితురాలి ఆలోచనలు నాలో కలవరం సృష్టిస్తున్నాయి" మురళి మాటలు విని స్వామివారు నవ్వారు.

వింటున్న నీలిమ మనసులో ఏవో అనుమానాలు దూరం అవుతున్నాయి.

"స్వామీ, నాకు ఇక్కడ ఒక ఆశ్రమం కట్టాలని ఉంది. ఈ గిరిజన గ్రామాల పిల్లల చదువు పోషణ తీసుకోవాలని ఉంది. ఈ ప్రయత్నానికి పెళ్లి ఆటంకం అవుతుందని దిగులు"

ఇక అక్కడుండలేక నీలిమ వారి వద్దకు వచ్చేసింది. మోకాలిపై కూర్చొని "స్వామీ, ఆశ్వీర్వదించండి" అంది.

"ఇష్టకామ్యార్థ సిద్ధిరస్తు" స్వామీవారు నవ్వుతూ దీవించారు.

నీలిమను చూసి మురళి తడబడ్డాడు.

"మురళీ! నన్ను కాదనకు. నీ ఆదర్శంలో నేను భాగమవుతాను. నీకు తోడుగా ఉంటాను" నీలిమ కన్నీళ్లతో అంది.

సూక్ష్మగ్రాహి అయిన స్వాములవారికి విషయం అర్థమయింది. "నాయనా, ఇద్దరూ విద్యావంతులు సంస్కారులు. ఒకరిని ఒకరు కోరుకుంటున్నవారు. ఒకే భావనగా మెలిగి మీ ఆదర్శాన్ని సఫలం చేసుకోండి" అంటూ స్వామివారు వెన్నెల్లో కదిలిపోయారు.

ఇంకా మోకాలిపై కూర్చొని ఉన్న నీలిమ భుజాలు పట్టి పైకి లేపాడు మురళి. "నీలూ నీపై చెప్పలేని ప్రేమ ఉంది. కానీ నా ఆలోచనలతో ఇబ్బంది పెడతానని భయం" అన్నాడు ఆమె కన్నీరు తుడుస్తూ. తడి కళ్లను ముద్దు పెట్టి ఐ లవ్ యూ నీలూ అన్నాడు కౌగిలించి. ఇద్దరు పచ్చికలో కూర్చున్నారు. ఒకరి చేయి ఒకరు బిగించి పట్టుకున్నారు. "మురళీ, నీకు ప్రకృతి అంటే ఇష్టం అని తెలుసు. కొండలు,


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. ఈ రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

లోయలు, మైదానాలు పిచ్చిగా తిరుగుతావని తెలుసు. కానీ ఈ మూడు నీకు ఒకే చోట చూపిస్తాను. చూస్తావా?" హస్కీగా అంది నీలిమ."మూడు ఒక్కచోట ఉంటాయా? చూపించు" అన్నాడు మురళి ఆశ్చర్యంగా."మురళీ! స్త్రీ పాదం నుండి శిరోజాల వరకు ఉన్నదంతా ప్రకృతే. ఇదిగో.. సూటిగా చూడు. ఇవి ఎదగిరులు అని అతని చేతిని తన ఎదపై ఉంచి చూపించింది. క్రమంగా అతని చేతిని కిందకి దింపి నాభి ప్రాంతంలో పెట్టి ఇది సమతల ప్రదేశం మైదానం" అంది నవ్వుతూ.
అతని చేతివేళ్లలో వణుకు.. ఏదో వేడి.
"లోయలేమిటో నువ్వు తెలుసుకో" అంది పక పక నవ్వి.
ఆ నవ్వులు మల్లెల కన్నా మత్తుగా అతన్ని కమ్మేసాయి.
"నీలూ! నీ నవ్వు రింగ్ టోన్‌గా పెట్టుకోవాలి" అంటూ ఆమె పెదాలు అందుకున్నాడు.
ఆమె కింది పెదవితో అతను, అతని పై పెదవితో ఆమె కొద్దిసేపు ఆడుకున్నారు. మెడవంపులో ముఖం పెట్టి నాలుకతో వంపును పలకరించాడు. "చాలా వేడిగా ఉన్నావు.
అరటి చెట్ల మధ్య సంచరిస్తే చలువ చేస్తుంది" అంది ఆమె మెల్లగా.
"ఇపుడు అరటి చెట్లు ఎక్కడ" అన్నాడు మురళి.
"నాలో ఉన్నాయి.. తెలుసుకో" అంది నీలిమ అతన్ని కవ్విస్తూ.
అరటిచెట్లు ఎక్కడ ఉన్నాయో అతనికి అర్థమయింది.
వంగి ఆమె ఊరువులకు ముద్దులు పెట్టాడు.
"ఇంతకీ లోయలేమిటో తెలిసాయా?" నీలిమ మాటల్లో చిలిపిదనం చిందులు తొక్కింది.
"నీలూ! నాకు ప్రకృతి అంటే ఇష్టం. కానీ ప్రకృతిలో నాకు ఇష్టమైనవన్నీ స్త్రీలో కూడా ఉన్నాయని నాకిప్పుడే తెలిసింది" అంటూ ప్రకృతిలో కలిసిపోవడానికి సిద్ధమయ్యాడు.
గిరులను, మైదానాలను తాకుతూ మనసు అనే లోయను టచ్ చేశాడు.
నీలిమ ఆనందంగా అతనికి సహకరిస్తోంది.
ఆమె తీపి మూలుగులు అతని ఉద్రేకాన్ని పెంచుతున్నాయి.
వెన్నెల వెలుగుల్లో ఆ చెట్ల నీడల్లో ఆ జంట రసానందం పొందుతోంది.
పైన చంద్రుడు వారిని చూసి నవ్వినట్టున్నాడు. మరిన్ని వెలుగులు వారిని కమ్మేశాయి.
దగ్గర్లో వాగు అడవిపూలు సముదాయం వారిలోని అద్వైత భావాన్ని గ్రహించి వారిని ఆశీర్వదించాయి. ప్రకృతి పురుషుణ్ణి తనలో కలిపేసుకుంది.
'ఇష్ట కామ్యార్థ సిద్ధిరస్తు' స్వామివారి దీవెన ఫలప్రదం అయింది.

# గిరిజన మహిళల ఘనత

ఒడిశాలోని ఓ మారుమూల జిల్లా కోరాపుట్. ఆ జిల్లాలో మరింత మూలలో ఉంటుంది అంచల గ్రామం. 1990ల నాటి సంగతి. వంటచెరకు కోసమని ఇతర అవసరాలకని ఊరి పక్కనున్న పవిత్ర మాలీ పర్వతం మీది చెట్లను విచక్షణారహితంగా నరకం ప్రారంభించారు. ఫలితంగా చూస్తుండగానే అడవంతా మరుభూమిగా మారింది. దానిపై నుంచి వచ్చే అందమైన సెలయేటి ధార కూడా శాశ్వతంగా ఆగిపోయింది. దాంతో అడవి బిడ్డలైన ఆ గిరిజనులు తల్లడిల్లారు. ముందుగా మహిళలే కళ్లు తెరిచారు. చిట్టడవికి తిరిగి జీవం పోసి పవిత్ర పర్వతానికి పూర్వపు కళ తేవాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం ముప్పై ఏళ్లు అకుంఠిత దీక్షతో శ్రమించారు. తమకు ప్రాణప్రదమైన అడవికి పునఃసృష్టి చేసి నారీ శక్తిని మరోసారి చాటారు. ఫలితంగా ఇప్పుడు కొండమీది 250 ఎకరాల్లోనేగాక ఊరి చుట్టూ పచ్చదనం



దట్టంగా పరుచుకుని కనువిందు చేస్తోంది.

**ఐకమత్యంగా..**

అయితే ఈ బృహత్కార్యం చెప్పినంత సులువుగా ఏమీ జరగలేదు. గ్రామస్తులందరూ కలిసికట్టుగా కష్టపడ్డారు. మొదట్లో మూడు/నాలుగు కుటుంబాలు ఒకేచోట వండుకోవడం మొదలుపెట్టారు. క్రమంగా వంటకోసం కట్టెలపై ఆధారపడటాన్ని వీలైనంతగా తగ్గించుకుంటూ వచ్చారు. సేంద్రియ సాగుకు మళ్లారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకున్నారు. అంతేగాక చెట్లను నరికే వారికి జరిమానా విధించారు. కచ్చితంగా జరిమానావసూలు చేశారు.
చెట్లు నరికేందుకు దొంగతనంగా ఎవరూ కొండపైకి వెళ్లకుండా ఒక కుటుంబాన్ని కాపలా పెట్టారు. వారికి జీతమిచ్చేందుకు డబ్బుల్లేకపోవడంతో ఊరంతా కలిసి వారికి పది కిలోల రాగులు ఇస్తూ వచ్చారట. ఈ ఉద్యమం మొదలైన రోజుల్లోనే పదిహేను ఏళ్ల వయసులో నవ వధువుగా తాను ఊళ్లో అడుగు పెట్టానని ఓ మహిళ గుర్తు చేసుకుంది. "మా శ్రమ ఫలించి మేం నాటిన చెట్లు చిగురించడం మొదలు పెట్టాయని ఎంతో సంతోషిస్తున్నారు.
ముప్పై ఏళ్లు మూగబోయిన జలధార కూడా మహిళల మొక్కవోని ప్రయత్న ఫలితంగా మళ్లీ ప్రాణం పోసుకుంది. కొండ మీది నుంచి జలజలా పారుతూ పూర్వ వైభవం సంతరించుకుని కనువిందు చేస్తోంది.

# పత్రికా రంగంలో తెలుగు భాషావికాసం

సాహిత్యం

తెలుగుభాష ప్రప్రథమంగా 1834లో 'ఫోర్ట్‌సెంట్ జార్జి గెజిట్'లో దర్శనం యిచ్చింది. ఆనాటి వ్యవహారిక ఆంధ్రభాష 1842 డిసెంబరు 15వ తేదీనాటి 'వర్తమాన తరంగిణి'లో ఒక వార్తాఖండికలో యిలా ఉంది.

"ఈ నెల 6వ తేదీ మంగళవారం తెల్లవారుజామున అయిదు గంటలకు మిక్కిలి అద్భుతమైన ఉల్క ఒకటి నైరుతి భాగం నుంచి ఈశాన్యమునకు దోగినది. మనవారు దీన్ని తోక నక్షత్రమని వాడుకొంటున్నారు ఈశాన్య దిక్కుకు వెళ్లేటప్పుడు వెనక పార్శ్వ నిప్పులు కక్కేటట్టున్న భూమి మీద అది పుట్టిన చోటి నుంచి రాలిన స్థలం వరకు వొకటే చాలుగా వొకటిన్నర నిమిషం వుండినది. కడాపట కింద పడేటప్పుడు బాగా కాలిన ఫిరంగి గుండువలె వుండి చూచిన వారికందరికీ వింతగా నుండినది. దీని వివరములు బాగా విచారించి రాద్దామనుకొన్నందున పోయినసారే రాయకూడకపోయెను". 1857కు పూర్వం వెలువడ్డ 'హితవాది', 'దినవర్తమాని' అనే పత్రికల భాష కూడా వ్యావహారికమే.

ప్రజా సామాన్యం ప్రగతి పొందాలన్న అభిప్రాయంలో మాకు నమ్మకముంది. బీదవారిలోను ఆర్తులలోను విజ్ఞాన దీపం వెలిగించటానికి భాషా సంస్కారాన్ని మించిన సాధనం ఉందా? మన చిన్నారులకు ఉత్తమ సాహిత్యం లేక డొక్కలు వూడి ఉన్నాయి. మన స్త్రీలు శుద్ధ కాల్పని సాహిత్యం కోసం వేచి ఉన్నారు. విద్య అంటే తరగతి గదిలో మాత్రమే చెప్పేది కాదు. అభ్యుదయాన్ని కలిగించే సాహిత్యం జీవితంలో అన్ని రంగాల్లోనూ అవసరమే" అన్నారు తెలుగు వాడుక భాషగా, వ్యవహారిక భాసా వైతాళికులైన గిడుగు వేంకట రామమూర్తి 1919 సెప్టెంబరు నాటి తన తెలుగు మాసపత్రిక ఉపోద్ఘాతంలో.

'భారతి' సంస్థాపక, సంపాదకులు అయిన దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు 1924లో భారతి మొదటి సంపుటం తొలి సంచికలో సంపాదకీయంలో ఇలా రాసారు. "ఆంధ్రభాష సంస్కృత సాంప్రదాయబద్ధమైనను, ప్రత్యేక సాంప్రదాయముల ననుసరించి వికసించినది. ప్రాకృత, సంస్కృత, ద్రవిడ భాషల సంపర్కము భాషాభ్యుదయమునకు తోడ్పడినను భావము భాషాశీలమును శిథిలము చేయలేదు. ఆంధ్రభాష స్వరాంతమై సరళ వర్ణ రంజితమై మృదుమధుర స్వభావాన్ని గాపాడుకొనగలిగినది. ఆంధ్ర వాఙ్మయము ప్రాకృత సంస్కృత కర్ణాటక వాఙ్మయముల సంపర్కమును గలిగినను ప్రత్యేక రీతిని వికసించినది. ఆంధ్ర వ్యక్తి పరిణామమును నిరూపించుటకపారమైన విషయావగాహనమును జేయుట కాంధ్రలోకము పూనుకొనవలసి యున్నది. సామాన్యంగా పత్రికా ప్రచురణముందుగల సాధక బాధకములనుభవ వేద్యములైనను ఈ కొత్త ప్రయత్నము సాహస కార్యముగ గనపడును. మాసపత్రిక నొకదానిని బ్రచురింపవలయునని తలంచి కార్యసిద్ధికి ప్రయత్నములు జరిగినవి. భారతిని పెంచి పోషించవలసిన భారమాంధ్ర లోకాధీనమై యున్నది. ఆంధ్ర మహాజనులు సదయ హృదయులై భారతికి స్వాగతంబు నొసంగి, దీవించి నా ప్రయత్నమును సఫలము చేయుటకు సాయపడుదురుగాక!" అన్నారు 'స్వవిషయము' శీర్షికన కాశీనాథుని వారి సంపాదకీయంలో. స్వర్ణోత్సం జరుపుకొన్న పత్రిక తెలుగులో ఒక్క 'భారతి'యే అన్నారు 'తెలుగు జర్నలిజం' ఆంగ్ల వ్యాసంలో ప్రముఖ ఎడిటర్ వి.ఆర్.నార్ల.

పాఠ్యాంశాలు తెలుగు మాధ్యమంలో బోధించడం, అధికార భాషగా తెలుగు అమలు చేయడం, పత్రికల భాషగా తెలుగు ప్రాచుర్యం, శాస్త్ర, సాంకేతిక విషయాలలో తెలుగు పదాల వినియోగం ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమంలో తెలుగు తప్పులు లేకుండా సాధ్యమైనంతగా అన్య భాషా సంపర్కం లేకుండా తల్లి భాషను ఆదరించడం నేటి రెండు తెలుగు రాష్ట్ర ప్రజల, ప్రభుత్వాల కర్తవ్యం. తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలోని అట్టడుగు వర్గాలు, సామాన్యులయిన పామరులు వినియోగించే పదజాలం తెలుగును మరింత సజీవ భాషగా తీర్చిదిద్దుతుంది. మీడియాగా పేర్కొనబడే ప్రసార మాధ్యమాలలో టివి, పత్రికలు భాషను బతికించగలవు.



కానీ ఎలక్ట్రానిక్ మాధ్యమాలు ప్రవేశించిన ప్రస్తుత పరిస్థితులలో పత్రికలే తెలుగుకు ప్రాణాధారం అవుతున్నాయి. తెలుగు వాడకం అంతరించే స్థితిగతులు సంక్రమిస్తున్న ఈ రోజులలో పత్రికా పఠనానికి ప్రభుత్వ పరంగా, ప్రజా పరంగా మరింత ప్రోత్సాహం లభింపచేయాలి. పత్రికల భాషకు చిత్రిక పట్టవలసిన అగత్యం కూడా తల ఎత్తింది.

పత్రికా భాష, ప్రత్యేకంగా వార్తలు, వ్యాసాలు, సంపాదకీయాలలో, పత్రికలలో నిత్యం ప్రచురింపబడే వివిధ సాహితీ ప్రక్రియలలో సృష్టించబడుతోంది. స్వాతంత్ర్యోద్యమం, రాష్ట్రోద్యమం, సంస్కరణలు, సమాజ అభ్యున్నతి వంటి అంశాలలో సృష్టించబడిన భాషా, భావజాలం తెలుగు పత్రికలు స్వీకరించాయి.

అందుకే స్వాతంత్ర్యానికి ముందు తరంవారు ముట్నూరి కృష్ణారావు సంపాదకీయాలు చదివిన తీరులోనే, స్వాతంత్ర్యానంతరం నార్లవారి సంపాదకీయాలు చదివారు. తెలుగు పత్రికా రంగానికి తొలి పాఠాలు నేర్పిన ఉద్దండులు ఎందరో ఉన్నారు. కందుకూరి, కాశీనాథుని, ముట్నూరి, తాపీ, సురవరం వంటి మార్గదర్శకుల కాలంనాటి పత్రికా భాష క్రమేపీ 'నార్ల' రాకతో తెలుగు ప్రజల భాషగా మరింత సంపన్నవంతమైంది.

"ఈ పత్రికా ప్రకటనము నందు నా యుద్దేశములు రెండు. భాషాభివృద్ధితో నేనేర్చుకొన్న మార్గం తెలుగు భాషలో మృదువైన, సులభ శైలిని సలక్షణ వచన రచనతో దేశాభివృద్ధి సాధించటం" అన్నారు సంఘ సంస్కర్త, తెలుగు పత్రికా వచన రచనా శైలికి ఆద్యులు కందుకూరి వీరేశలింగం తన స్వీయచరిత్రలో వివేకవర్ధని పత్రిక ప్రస్తావనలో.

**- జయసూర్య**

# తిక్కన భారతంలో నా(నే)టి సాంఘిక విషయం

వెంకట్ భట్టు



సంస్కృత భారతాన్ని తెలుగులోని తిరగరాయడంలో నన్నయ అనుసరించిన పద్ధతికి, తిక్కన కొనసాగించిన పద్ధతికి చాలా తేడా వుందన్నది విదితమే! ఈ తేడా అన్నది ముఖ్యంగా భాషలోనే కాకుండా, అనువైన చోట్ల తిక్కన చేర్చి చెప్పిన కొన్ని సాంఘిక విషయాలలో కూడా కనిపిస్తుంది. రోజువారీ సంభాషణలలో ఈ రోజుకూ వినబడే మాటలు తిక్కన కాలమైన క్రీ.శ.13వ శతాబ్దపు నాటి తెలుగు భారతంలో ఇతిహాస పాత్రల మధ్య చోటు చేసుకుని కనిపించడం నేటికాలపు చదువరికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. మచ్చుకు కొన్ని ఉదాహరణలు:

'వంట చేయిస్తాను మరి'

మాయాజూదంలో ఓడిపోయిన కారణంగా చేయవలసిన వనవాసం, అజ్ఞాతవాసం ముగిసి పాండవులు న్యాయంగా వారికి రావలసిన రాజ్యభాగం కోసం ప్రయత్నాలు మొదలు పెడతారు. అందులో భాగంగానే శ్రీకృష్ణుని రాయబారిగా దుర్యోధనుని వద్దకు ధర్మరాజు పంపుతాడు.. అర్ధరాజ్యం కాకపోతే కనీసం అయిదు వూళ్లనన్నా తమ భాగంగా సాధించుకు వస్తే చాలని చెప్పి. తమ్ముడైన సాత్యకితో పాటుగా హస్తినకు చేరుకున్న శ్రీకృష్ణుడు ముందుగా ధృతరాష్ట్రుని దర్శనం చేసుకుని, అర్ఘ్య పాద్య మధుపర్కాలనే శాస్త్రయుక్తమైన గౌరవ మర్యాదలను అందుకున్నాడు. ఆ తరువాత ధృతరాష్ట్రునితోనూ, ఇంకా అక్కడ సభతీరిన వారందరితోనూ కొంతసేపు ప్రియంగా మాట్లాడి, ఆ తరువాత అయినవాళ్లందరినీ ఒకసారి పలకరించి మళ్లీ వస్తానని వెళ్లిపోతాడు. అలా తనకు 'అయినవాళ్లు' అని గోవిందుడు అన్నవాళ్లలో అత్యంత ముఖ్యులు విదురుడు, కుంతీదేవి. అరణ్యవాసం గడిచినంత కాలం పాండవులతోనే తాను కూడా అడవులలో గడిపిన కుంతీదేవి, అజ్ఞాతవాసం ఆరంభం కాబోతుండగా పాండవులను విడిచి బావగారైన ధృతరాష్ట్రుని పంచన చేరుతుంది, మరి చేసేది లేక.

ముందుగా విదురుని ఇంటికి బయలుదేరతాడు శ్రీకృష్ణుడు. ధృతరాష్ట్రునితో సభలో వున్న విదురుడు వెంటనే లేచి కృష్ణుడు తన ఇంటికి చేరే లోపలే తాను వెంటికి వెళ్లి సాదరంగా ఆహ్వానిస్తాడు. కృష్ణుని దేవునిగా భావించి, దేవతలకు చేసే ఉపచారాలన్నీ చేస్తాడు. పాండవుల కుశలం అడుగుతాడు. ఈ సంభాషణతో కొంత తడవు గడిచాక, మేనత్తయైన కుంతీదేవి దర్శనం చేసుకుని వస్తానని బయలుదేరుతాడు కృష్ణుడు. ఆ సందర్భంలోనిది ఈ పద్యం.

ముదమున గృష్ణుడు కుంతీ
సదనమునకు జనియె;
నపుడు సమ్మదమున న
వ్విదరుం'డోగిర మొనరిం
చెద' నని తన్నడుగ 'నట్ల చేయుం'
డనుచున్.

(తిక్కన భారతం, ఉద్యోగపర్వం, తృతీయాశ్వాసం, 181వ పద్యం, కందం)

అలా బయలుదేరిన కృష్ణునితో "మరైతే వంట చేయిస్తాను" అంటాడు విదురుడు. "అలాగే చేయించండి!" అని బదులిస్తాడు గోవిందుడు.

ఈ రెండు మాటలే ఈ పద్యంలోని ముఖ్య విషయము, పద్యానికి అందమూను. తెలుగువారి ఇళ్లకు చుట్టపుచూపుగా ఎవరైనా బంధువు వచ్చి, పనిలో పనిగా ఇంకేదైనా పనిని చక్కబెట్టుకుని వస్తానని బయలుదేరినపుడు, మధ్యాహ్నం భోజనానికి మా ఇంటికే రావాలని చెప్పడానికి అన్నట్లుగా సాధారణంగా ఇంటి యజమాని అనే ఈ మాటనే ఆనాడు విదురునితోనూ చెప్పించాడు తిక్కన.

అలా ఇళ్లల్లో జరిగే మామూలు సంభాషణను, ఇతిహాసాల్లోకి ఎక్కించి, "వీళ్లూ మనం మాట్లాడే మాటలు మాట్లాడుతారు సుమా!" అని చెప్పే ప్రయత్నం వీలు దొరికిన చోటల్లా తాను రచించిన భారత భాగంలో చేశాడు తిక్కన.

ఈ పద్యం చదవగానే, విదురుడు 'వంట చేయిస్తాననడం ఏమిటి?' వింతగా వుందే అనిపిస్తుంది. ఆ వెంటనే గోవిందుడు సమాధానంగా "అలాగే మీ యిష్టం" అని సమాధానమివ్వడం, మరీ నవ్వు తెప్పించడమే కాక, ఆహ్లాదాన్ని కూడా కలిగిస్తుంది. మానవమాత్రులకే కాదు, దైవసమానులైన మానవులకు కూడా వంట చేసుకుంటేనే కదా ఆ పూటకు తినడానికి వుండేది! అన్నది ఇందులో తిక్కన సందర్భానుసారంగా, తెలుగిళ్లలో మాట్లాడుకునే మాటలను ఉపయోగించి మరీ చెప్పదలచుకున్న, చెప్పిన సాధారణ సత్యం.

'లంచం'

'లంచం' అనే మాట ఎప్పటి నుండి మనకు వాడుకలో వుంది? అంటే ఇదిగో కనీసం తిక్కన కాలమైన 13వ శతాబ్దం నుండి వాడుకలో వుంది అని చెప్పొచ్చు నిస్సందేహంగా.

నీ తల పేను గంటి నొక నేర్పున శౌరికి
లంచమిచ్చి సం
ప్రీతుని జేసి, కార్యగతి భేదము సేయగ
జూచె; దింత బే
లైతిగదే! సుమేరు సదృశార్థము
జూచియు బార్థు బాయునే
యాతడు? క్రీడి భక్తియును నచ్యుతు
పెంపును నీ వెఱుంగవే?

(తిక్కన భారతం, ఉద్యోగ పర్వం, తృతీయాశ్వాసం, 159వ పద్యం,

ఉత్పలమాల)
'లంచం' అనేది కేవలం ఒక మాటగా అనుకోవడం కాదు ఇక్కడ విషయం. ఆ మాట వెనుక వున్న ఆలోచనా ధోరణి, ఒకడిని కొంత సొమ్ముతో మభ్యపెట్టి న్యాయంగా తనకు రాకూడని గొప్ప మేలును సాధించడానికి పడే న్యాయబద్ధంకాని తాపత్రయం అందులో దాగివుండడం ముఖ్యమైనది.
పాండవుల వైపు నుండి మాట్లాడడానికి కృష్ణుడు బయలుదేరి వచ్చి హస్తినకు కొద్దిదూరంలో కుశస్థలం అనే చోట విడిది చేశాడనే కబురు ధృతరాష్ట్రునికి చేరింది. నగరం మొత్తాన్నీ శోభాయమానంగా అలంకరించమని హడావుడి మొదలుపెట్టి, మన ఇంట్లో ముఖ్యంగా దుర్యోధన, దుశ్శాసనుల మందిరాల్లో కృష్ణుని కన్ను పడి, అతనికి ప్రీతిని కలిగించిన ప్రతి వస్తువును కృష్ణునకు కానుకగా మనం ఇచ్చి పంపాలనీ, కాబట్టి ప్రతి వస్తువునూ శోభాయమానంగా అలంకరించాలని విదురునితో చెబుతాడు. అంతేకాకుండా, కృష్ణునికి మణులు పొదిగిన రథాలను, మేలైన అశ్వాలను, భద్రజాతికి చెందిన గజములను కానుకగా ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి వాటిని కూడా సిద్ధం చెయ్యమంటాడు. అంతా విన్న విదురుడు కృష్ణుడికి ప్రీతి కలిగేలా చేయడం మంచిదే. కానీ నీ హడావుడి చూస్తుంటే నాకు మాత్రం ఒక సందేహం కలుగుతూ వుంది.. అని చెప్పే సందర్భంలోనిది పై పద్యం.
"నీ ఆలోచన నేను గ్రహించాను. కృష్ణునికి లంచం ఇచ్చి తృప్తిపరచి, కాగల కార్యంలో ఏదో భేదాన్ని సాదిద్దామని అనుకుంటున్నావు నువ్వు. ఎంత పిచ్చివాడివి! మేరు పర్వతమంత ధనాన్ని తెచ్చి అతని ముందు కుమ్మరించినప్పటిక్కూడా, కృష్ణుడు అర్జునుడిని వదిలిపెడతాడనుకున్నావా? కృష్ణుని యెడల అర్జునునికి ఎంత భక్తి వున్నదో, గోపాలుని గొప్పదనం ఏమిటో నీకు తెలియనివా?" అని విదురుడు చెప్పిన మాటలు పై పద్యంలో భావం. 'కానుకల రూపంలో లంచం ఇచ్చి పరమాత్ముని మనసు మరాప్చ ప్రయత్నం చేద్దామన్న ఆలోచనలోనే నీ వెర్రితనం దాగి వుంది సుమా!' అనే వ్యంగ్యం కూడా విదురుని పై మాటలలో వుంది.
"అర్జునుడు ప్రాణతుల్యుండు హరికి, నట్లుగాన, జలపూర్ణ మంగళ కలశమునకు, బాద్యమునకును, గుశల




ప్రశ్నంబునకు మిగుల నొండు జనార్దను మెచ్చుగాదు" అనగా–
'అర్జునుడు కృష్ణునికి ప్రాణసమానుడు కాబట్టి, మంగళాచరణానికైన పూర్ణకుంభ స్వాగతానికి మించి, కాళ్లు కడుగుకునే నీళ్లకు మించి కుశల ప్రశ్నలకు మించి మరి దేనినీ అంతగా పట్టించుకోడు, మెచ్చుకోడు' అని కూడా (ఆ తరువాతి పద్యంలో) విదురుడు చెబుతాడు.
'తగులు'
సౌంభపుర వల్లభుండైన సాళ్వుమీద
దలపు గలదు నా; కతడును దగులు గలిగి
యుండు నాడెస; నీవు ధర్మోత్తరుండ;
వతని పాలికి దగ నన్ను ననుపవయ్య!
(తిక్కన భారతం, ఉద్యోగ పర్వం, చతుర్థాశ్వాసం, 275వ పద్యం, తేటగీతి)
శిఖండి వృత్తాంతాన్ని వివరంగా చెబుతున్నాడు భీష్ముడు. యుద్ధానికి వెళ్లబోయే ముందు అసలు ఎవరెవరి బలం ఎంతటిదో తెలియజెప్పమంటాడు దుర్యోధనుడు భీష్ముడిని. ఎన్ని రోజులలో పాండవసేన మొత్తాన్ని నాశనం చేసి విజయాన్ని సాధించి పెట్టగలవో చెప్పమంటాడు. నెల రోజులలో మొత్తాన్నీ నేలకరిపించగలనంటాడు భీష్ముడు. అయితే ఈ మధ్యలో ఎప్పుడైనా శిఖండి నా యెదుట పడితే మాత్రం అస్త్ర సన్యాసం చేయడమొక్కటే తాను చేయగలిగిందని కూడా చెబుతాడు. అప్పుడు
"ఎవరీ శిఖండి?" అనే ప్రశ్న అందరి ముఖాలలో కనిపించగా, భీష్ముడు శిఖండి, వృత్తాంతం మొత్తం చెబుతాడు. ఆ వృత్తాంతంలో ఒకటి పైన పేర్కొన్న పద్యం.
ఈ పద్యంలో 'తగులు కలిగి యుండు' అనే మాటలకు తిక్కన నాటికీ (క్రీ.శ.13వ శతాబ్దం) ఇప్పటికీ అర్థంలో చాలా మార్పు వచ్చింది. 'మమకారం కలిగి వుండడం' అనే అర్థంలో తిక్కన ఈ మాటను వాడాడు.
కాశీరాజు కుమార్తెలైన అంబ, అంబిక, అంబాలికలను స్వయంవరం నుండి బలవంతంగా ఎత్తుకొచ్చేస్తాడు భీష్ముడు, శంతనుడి కుమారుడైన విచిత్రవీర్యునికిచ్చి వివాహం చేయాలనే తలంపుతో. ఆ ముగ్గురిలో అంబ భీష్మునితో చెప్పే మాటలు పై పద్యం. ఈ అంబయే భీష్ముడిని యుద్ధంలో చంపగలిగే వరం సంపాదించినదై, మరుజన్మలో శిఖండిగా అవతరిస్తుంది. అది నాలుగు మాటలలో చెప్పగలిగే కథ కాదు.
"సౌంభపురానికి రాజైన సాళ్వుని మీద నేను మనసుపడి వున్నాను. అలాగే సాళ్వుడు కూడా నేనంటే మమకారం కలిగి వున్నాడు. ధర్మం తెలిసినవాడు నీవు, దయతో నన్ను అతని వద్దకు పంపించి నీ మర్యాదను నిలుపుకొమ్మ"ని అంబ భీష్మడిని అభ్యర్థించడం పై పద్యం భావం. 'తగులుకోవడం' అనే రూపంలో ఇప్పుడు ఈ మాటకున్న అర్థానికి, తిక్కన కాలం నాటి అర్థానికీ ఇంతగా తేడా రావడం ఎలా సంభవమైందో చెప్పలేంగానీ, వచ్చిన తేడా మాత్రం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ❐



**"ఈరోజు ప్రపంచంలో పలు సమస్యలకు మూలకారణం ఏమిటో తెలుసా?" అని అడిగాడు ఒకడు.**

**"తెలీదు.. నువ్వే చెప్పే" అన్నాను.**

**"ఏముందండీ, ఒక మనిషిని మనిషిగా చూసే తత్త్వం లేకపోవడమే. మర్యాద ఇచ్చి పుచ్చుకోవడమనేది చాలా మందికి తెలీదు. అహం పెరిగిపోయింది. దాంతో సమస్యలు తలెత్తుతున్నాయి. డబ్బుతో లభించని ఉత్సాహం, మర్యాద, మనిషిని మనిషిగా చూడటం వల్ల లభిస్తుంది" అన్నాడతను.**



# మనిషిని మనిషిగా చూడాలి

అందుకు టాల్‌స్టాయ్ జీవితంలో జరిగిన ఓ సంఘటన అతను ప్రస్తావించాడు. ఓమారు టాల్‌స్టాయ్ మాస్కో నగరంలో ఓ రహదారిలో నడుచుకుంటూ పోతున్నారు. అప్పుడు ఎదురుగా ఓ బిచ్చగాడు వస్తున్నాడు.



"అయ్యా, ధర్మం చెయ్యండి బాబూ!" అని అడిగాడు ఆ బిచ్చగాడు.

టాల్‌స్టాయ్‌ది జాలిమనసు. ఏ మనిషినైనా ఎంతో అభిమానంతో చూసేవారు. ఎంతో ప్రియంగా పలకరించేవారు. మాటల్లో ఓ మంచి మనసుండేది. అవతలి వ్యక్తి చిన్నవారా, పెద్దవారా అని చూసేవారు కాదు. తగిన మర్యాద చేసేవారు వారికి.

ఆ బిచ్చగాడికి ఏదన్నా ఇవ్వాలనుకున్నారు. తన చొక్కా జేబులో చేయి పెట్టారు. కానీ జేబులో చిల్లిగవ్వ లేదు.

వెంటనే బిచ్చగాడి వంక చూసి "తమ్ముడూ, జేబులో డబ్బుల్లేవు" అన్నారు టాల్‌స్టాయ్.

అయితే అర్ధాకలితో ఉన్న ఆ బిచ్చగాడి ముఖం సంతోషంతో విప్పారింది.

"అయ్యా, మీరు బిచ్చం వేయకపోయినా పరవాలేదండి. ఇప్పుడు నా మనసు నిండుగా.. తృప్తిగా ఉంది. ఆనందంగా ఉందండీ" అన్నాడు బిచ్చగాడు.

టాల్‌స్టాయ్‌కి ఆశ్చర్యం. తాను డబ్బుల్లేవని చెప్పినా ఈ మనిషి ఆనందిస్తున్నాడేమిటా? అనుకున్నారు. ఆయన ఆ బిచ్చగాడి ముఖంలోకి చూసాడు. అవును.. బిచ్చగాడి ముఖాన ఆనందం కనిపిస్తోంది.

బిచ్చగాడు "అయ్యా, మీరు చిల్లరపైసలు ఇవ్వకపోయినా పరవాలేదండి.. అంతకుమించి పెద్ద సహాయం మీరు చేశారు. అదేమిటని అనుకుంటున్నారా? నన్ను తమ్ముడూ అని పిలిచారు. అది చాలండీ" అన్నాడు.

"నా వంక చూడటానికి ఏమాత్రం ఇష్టపడనివారు, బిచ్చమడుగుతున్నానని చిన్న చూపు చూసేవారున్న ఈ ప్రపంచంలో నన్నూ ఓ మనిషిగా అనుకుని తమ్ముడూ అని అనడం ఎంతో ఆనందంగా ఉందండి" అన్నాడు బిచ్చగాడు.

అతనికి టాల్‌స్టాయ్ పట్ల గౌరవం పెరిగింది.

కేవలం డబ్బుతో పొందని ఆనందం, ఉత్సాహమూ సాటి మనిషిని ఓ మనిషిగా చూసి గౌరవించి మాట్లాడటం వల్ల కలుగుతాయనడానికి ఈ సంఘటన ఓ ఉదాహరణ.


టాల్‌స్టాయ్‌లాగా మనకూ ఆ గుణం కలగాలంటే ఏం చేయాలి...

ఏముందీ..

రోజూ కాస్సేపయినా మన గురించి మనం ఆలోచించడం మాని ఇవతలకు వచ్చి ఇతరుల హృదయంలో చోటు సంపాదించి వారి కళ్లల్లోంచి ఈ లోకాన్ని చూడాలి. అందుకు తగిన ప్రయత్నం చేయాలి. సాటి మనిషిని మనిషిగా చూడగలిగే తత్త్వం ముఖ్యం.

అలా చేసినవారు చాలా మందే ఉన్నారు. కానీ మనం తెలుసుకోం.

ఓమారు Ludwig Philipp Albert Schhhweitzer అమెరికా వెళ్లారు. అప్పుడు ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులలో ఒకడు ఆయనను కలిశాడు. తనతో హోటలుకి రావాలని అడిగాడు ఆ పూర్వ విద్యార్థి.
అందుకు ఆయన సరేనన్నారు. ఇద్దరూ కలిసి హోటలుకి వెళ్లారు. అక్కడ ఆయనను ఓ చోట కూర్చోబెట్టాడు పూర్వ విద్యార్థి.
ఆయన కోసం ఓ స్పెషల్ కేకు ఆర్డరిచ్చి తెప్పించాడు. తనతో కేకు కట్ చేయించే ముందర Schweitzer ఆ గదిలో ఎందరు ఉన్నారో లెక్కపెట్టారు. ఆ



సమయంలో అక్కడ తొమ్మిది మంది ఉన్నారు. కానీ ఆయన పది ముక్కలు కోశారు.

ఉన్నది తొమ్మిది మందే కదా కానీ ఆయన పది ముక్కలు ఎందుకు కట్ చేసారా? అని కొందరు ఆలోచించారు.
అప్పుడు Ludwig Philipp Albert Schewritzer చెప్పారు.
ఎంతో ప్రియంగా ఆ కేకుని తీసుకువచ్చి పెట్టిన ఆ సర్వరుకే ఆ పదో ముక్క అన్నారు.
ఇదే మంచి మనసంటే. ఓ మనిషి మరొక మనిషిని మనిషిగా చూడటం అన్నది ఎంతో ముఖ్యం.
మర్యాద ఇవ్వాలి.. పొందాలి.

**- యామిజాల జగదీశ్**

## అందాల అగ్నిపర్వతం ఫ్యూజి

**(7వ పేజీ తరువాయి)**

జపాన్‌లోని షింటో మతస్థులు, పర్వతారోహకులు, పాటలు పాడుతూ, సందడి చేస్తూ సన్నని దారుల వెంట పర్వతాన్ని అధిరోహిస్తుంటారు. పర్వత శిఖరానికి చేరుకున్నప్పుడు ఆకాశపు అంచుకు చేరుకున్న అనుభూతి కలుగుతుంది. సాధారణంగా మనం మేఘాలను చూడాలంటే నేలపై నుండి ఆకాశం వైపుకు తల ఎత్తి చూస్తాం. ఎత్తయిన ఫ్యూజి శిఖరాన్ని అధిరోహిస్తే శిఖరం దిగువన వెండిమబ్బులు కనువిందు చేస్తాయి. మేఘాలు శిఖరం కంటే దిగువన ఉంటాయి. పర్వత అగ్రభాగం వైపుకు నడిచేకొద్దీ మనకు దిగువ భాగాన నేల కనిపించదు. అన్నీ మేఘాలే కనిపిస్తాయి. ఫ్యూజి పర్వతమంతా శీతాకాలంలో మంచుతో కప్పి ఉంటుంది. ఇతర సమయాలలో కొన్ని చోట్ల మాత్రమే అలా ఉంటుంది.



మరికొన్ని చోట్ల రాళ్లు, మట్టిదారులు ఉంటాయి. కాళ్లు కూడా జారిపోతుంటాయి. పర్వతారోహణ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఫ్యూజి పర్వతాన్ని 377 మీటర్ల వరకు ఎత్తుకు అధిరోహిస్తే చాలు.. చలి పెరుగుతూ పోతుంది.



పచ్చని ప్రకృతి, లోయలు, మబ్బులు, మంచుతో కప్పబడిన ప్రదేశం అద్భుతంగా కనిపిస్తాయి. ఇప్పుడు పాటలు పాడుతూ, క్రీడా స్ఫూర్తితో ఫ్యూజి పర్వతాన్ని అధిరోహించేవారు ఎక్కువయ్యారు. జీవితంలో ఒక్కసారైన ఫ్యూజి పర్వతాన్ని అధిరోహించాలని ఇక్కడివారు భావిస్తారు. ఆ కారణంగా ఇప్పుడు ఏడాదికి సుమారు అయిదు లక్షల మంది వరకు ఫ్యూజి పర్వతాన్ని అధిరోహిస్తున్నారు. ఫ్యూజి పర్వతాన్ని అధిరోహించడమనేది జీవితంలో ఒక మధురానుభూతి. ఫ్యూజి పర్వతం కవులు, కళాకారులకు స్ఫూర్తిని కలిగిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఇక్కడి ప్రకృతి రమణీయ అందాలను తిలకిస్తే కవిత్వం పొంగి పొర్లుతుంది. ఫ్యూజి సమీప గ్రామాలలో అందమైన పూల చెట్లు, చెర్రీ చెట్లు, సుందర బౌద్ధ దేవాయలాలు నయనానందం కలిగిస్తాయి. ❑



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



జీవిత భాగస్వామి ద్వారా స్థిరాస్తి లభిస్తుంది. కాలానుగుణంగా చేసే వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. కుటుంబంలో స్వల్ప మనస్పర్థలకు అవకాశం. ప్రభుత్వోద్యోగులకు పనిఒత్తిడి ఉంటుంది. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. పాప కార్య చింతన మంచిది కాదని తెలుసుకుంటారు. కళాకారులకు సన్మాన యోగం. ఆర్థికంగా బాగుంటుంది.

## వృషభం



విద్యా రంగంలో పని చేసేవారికి బాగుంటుంది. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. ఆదాయానికి మించిన ఖర్చులున్నా సమయస్ఫూర్తితో వ్యవహరించి కుటుంబ సభ్యుల ప్రశంసలు అందుకుంటారు. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి లాభం.

## మిథునం



శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. ఆహార, ఆరోగ్య సలహాలు తూచా తప్పకుండా పాటించండి. శుభ కార్యాలకు హాజరవుతారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. వృత్తి విద్యాకోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది.

## కర్కాటకం



మీ శక్త్యానుసారం దాన ధర్మాలు చేస్తారు. ముఖ్యమైన సకాలంలో పూర్తి చేస్తారు. కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. చిరకాల వాంఛ వారాంతంలో తీర్చుకుంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. చర్చలు ఫలిస్తాయి.

## సింహం



ఆర్థికంగా బాగుంటుంది. దేవాలయాలు సందర్శిస్తారు. ఆహార, ఆరోగ్య సలహాలు తూచా తప్పనిసరిగా పాటించండి. మీ శక్తిమేరకు అనాథాశ్రమాలకు ఆర్థిక సహాయం చేస్తారు. క్రీడాకారులకు వృత్తి పరమైన ప్రోత్సాహం లభిస్తుంది. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి అలవడుతుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు.

## కన్య



ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ధార్మిక చింతన అలవడుతుంది. ఆదాయ-వ్యయాలు సమానంగా ఉంటాయి. చర్చలు వాయిదా.

## తుల



మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. కాలానుగుణంగా వ్యాపారం చేసేవారికి బాగుంటుంది. తాహతుకు మించిన రుణాలు చేస్తారు. విదేశీ యాత్రలు చేయాలన్న కోరిక తీరే సూచనలున్నాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. ఆకస్మిక ఖర్చులుంటాయి.

## వృశ్చికం



శత్రువులు మిత్రులవుతారు. సొంతింటి కల నెరవేరే సూచనలున్నాయి. చిరు వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి పోటీ ఉంటుంది. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. క్రీడాకారులకు, కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. వృధా కాలక్షేపం చేస్తారు. భాగస్వామ్య వ్యాపారులకు ఆశించిన మేరకు లాభాలుంటాయి. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు సత్ఫలితాలనిస్తాయి. గృహ యోగం.

## ధనుస్సు



పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. దేవాలయాలు సందర్శిస్తారు. ఆరోగ్య, ఆహార సలహాలు, సూచనలు పాటించండి. స్త్రీలకు శుభ యోగం. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని నిశ్చయించుకుంటారు. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. భూ-వివాదాలు మరింత తీవ్రమవుతాయి. ఉద్యోగులకుపై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. ముఖ్య సమస్యలు పరిష్కారమవుతాయి.

## మకరం



ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. సన్నిహితుల సహకారం లభిస్తుంది. వృత్తి కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది ఉద్యోగంలో పనివత్తిడి పెరుగుతుంది. దేశాంతర ప్రయాణం చేస్తారు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. వ్యాపారులకు అనుకోని విధంగా స్వల్ప నష్ట సూచనలున్నాయి. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. తీర్థ యాత్రలు చేస్తారు.

## కుంభం



ఆరోగ్య సమస్యలుంటాయి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్త్రీలకు స్థిరాస్తి లభిస్తుంది. గతంలో ఆగిపోయిన పనులు వారాంతంలో తిరిగి ప్రారంభిస్తారు. వృధా ఖర్చులను నియంత్రిస్తారు. చిరు వ్యాపారులు పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. శుభ కార్యాలకు హాజరవుతారు.

## మీనం



స్వగృహ రుణాలు తీరుస్తారు. హోల్ సేల్ రంగంలోని వారికి లాభాలుంటాయి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కుటుంబంలో ఐకమత్యం కొరవడుతుంది. సహనం అలవరచుకుంటే మంచిది. వ్యవసాయదారులకు బాగుంటుంది. విదార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. చర్చలు ఫలిస్తాయి.

**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**
**సెల్స్: 9885446501/9885449458**



# ద్వారాలు-ఫలితాలు

ఇంటికి ఒకే ద్వారం వుంచవలసి వస్తే దాన్ని ఆ ఇంటి దక్షిణ, పడమరల వైపు అమర్చకూడదు. తూర్పుకుగానీ, ఉత్తరానికిగానీ అమర్చుకోవాలి. ఒకవేళ ఇంటికి ఒకే ద్వారాన్ని అమర్చటానికి వీలు వుంటే ఆ ద్వారాన్ని దక్షిణంవైపుగానీ, పడమరవైపు గానీ అమర్చటం కంటే గత్యంతరం లేకపోతే అలాంటి నిర్మాణాలను చేయకపోవటం అటువంటి గదుల్లో వుండకపోవటం ఉత్తమం. తూర్పు లేదా ఉత్తర సింహ ద్వారం (ఉండేది ఒకే ద్వారమయినప్పుడు అదే సింహద్వారం అవుతుంది) గల ఇళ్లకు లేదా నైరుతి కప్పు గదికిగానీ ఈశాన్య గదికిగానీ ఈ ఒకే ద్వారం వుండే అవకాశం ఉంటుంది.

**ఇంటికి రెండు ద్వారాలు మాత్రమే అమర్చుకోవలసి వస్తే** ఏదో ఒక ద్వారం తూర్పుకుగానీ, ఉత్తరానగానీ తప్పక అమర్చాలి. రెండు ద్వారాలు ఒకటి తూర్పుకు మరొకటి ఉత్తరానికి అమర్చుకోవటం సర్వదా శ్రేష్ఠం. అలా వీలు కానప్పుడు ఒక ద్వారం తూర్పున మరొకటి దక్షిణం, పడమరలలో ఒక దగ్గర అమర్చాలి.

రెండు ద్వారాలు పడమరలో ఒకటి దక్షిణంలో ఒకటి నిర్మించకూడదు.

ఒక ద్వారం ఉత్తరంలో అమర్చి- మరొకటి దక్షిణం వైపుగానీ, పడమరవైపుగానీ అమర్చుకోవచ్చు.

ఒక ద్వారం ఉత్తర, తూర్పు భాగాల్లో తప్పక అమర్చి, మిగతా ఒక ద్వారం పశ్చిమ, దక్షిణాల్లో అమర్చుకోవచ్చు.

రెండు ద్వారాలు తూర్పు, ఉత్తరాల్లో అమర్చుకోవటం శ్రేష్ఠమని గుర్తుంచుకోవాలి.

**మూడు ద్వారాలు ఇంటికి ఒకేవైపు అమర్చవలసి వస్తే-**

ఒకటవ ద్వారం 'దక్షిణ ఆగ్నేయం'లో అమరుతుంది. ఈ వైపు నడిచి వీధిలోకి వెళ్లటం శుభ పరిణామాలనిస్తుంది.. ఉత్తమం.

రెండవ ద్వారం 'మధ్య'లో అమరుతుంది. ఇది మధ్యమం. ఇటు వైపు నడక మంచిదే.

మూడవ ద్వారం 'దక్షిణ నైరుతి' వైపు అమరుతుంది. ఈ నడక నీచం. ఆ ఇంట్లో నివాసముండే స్త్రీల పైన చెడు ప్రభావం చూపిస్తుంది. ఈ ద్వారం అమర్చకపోవడం మంచిది.

**పశ్చిమంలో మూడు ద్వారాలు అమర్చవలసి వస్తే-**

ఒకటవ ద్వారం 'పశ్చిమ నైరుతి'లో అమరుతుంది. ఇది నీచము. గృహ యజమాని, మొదటి కుమారుని పైన ఈ నడక చెడు ప్రభావం చూపిస్తుంది. ఈ ద్వారం అమర్చకపోవటం మంచిది.

రెండవ ద్వారం 'మధ్యమం'. ఈ నడక మంచిదే.

మూడవ ద్వారం 'పశ్చిమ వాయువ్యం'లో అమరుతుంది. ఈ నడక మంచిది, శుభప్రదమయింది.

**ఒకవేళ ఉత్తరంలో మూడు ద్వారాలు అమర్చవలసి వస్తే-**

ఒకటవ ద్వారం 'ఉత్తర వాయువ్యం'లోకి వస్తుంది. ఈ నడక మంచిది కాదు. ఈ ద్వారం వల్ల ఇంట్లో మూడవ సంతతి చెడు ప్రభావానికి లోనవటం జరుగుతుంది. మూడవ సంతతి అబ్బాయి అయినా, అమ్మాయి అయినా కీడు జరిగే ప్రమాదం ఉంటుంది. కనుక ఆ ద్వారాన్ని అమర్చకపోవటం మంచిది. అది నీచము.

రెండవ ద్వారం మధ్యమం. ఈ నడక మంచిదే.



మూడవ ద్వారం 'ఉత్తర ఈశాన్యం'లో అమరుతుంది. ఈ ద్వారం చాలా శ్రేష్ఠమైంది. ఉచ్ఛమయినది. మంచి ఫలితాలను ఇస్తుంది, ధనవృద్ధి కలుగుతుంది.

**ఒకవేళ ఇంటికి తూర్పున మూడు ద్వారాలు పెట్టాల్సి వస్తే-**

ఒకటవ ద్వారం 'తూర్పు ఈశాన్యం'లో అమరుతుంది. ఇది ఉచ్ఛము. శ్రేష్ఠము. కీర్తి ప్రతిష్ఠలు, వంశాభివృద్ధి కలుగుతాయి.

రెండవ ద్వారం 'మధ్యమం' మంచిదే.

మూడవ ద్వారం 'తూర్పు ఆగ్నేయం'లో అమరుతుంది. ఈ ద్వారం ఉండటం వలన కష్టనష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది. కాబట్టి తూర్పు ఆగ్నేయ ద్వార అమర్చుకోకపోవటం మంచిది. ❍



సింగిల్ పేజీ కథ


# నిజాయితీ విలువ


గొర్రెపాటి శ్రీను


సమయం రాత్రి పది గంటలు.
హైదరాబాద్ నుండి బస్సులో వచ్చిన జనార్ధనరావు క్లాక్ టవర్ సెంటర్‌లో దిగి, ఆటో ఎక్కి, చైతన్యపురి కాలనీ వెళ్లాలనుకున్నాడు.
ఎనిమిది దాటితే ఆర్టీసీ బస్సులు అటుగా వెళ్లడానికి వుండవు. అంతకుముందైతే సాగర్ బస్ ఎక్కి చైతన్యపురి స్టాప్ అని రిక్వెస్ట్ చేస్తే బస్ ఆపుతారు.
ఇంత రాత్రివేళ ఆటోలే వుంటాయి.
"చైతన్యపురి కాలనీ వస్తావా?"
"ఆ వస్తాను.. సార్"
"ఎంత?"
"నూట యాభై రూపాయలు సార్"
"అదేంటి? నూటా ఇరవయ్యే కదా?" సందేహంగా అడిగాడు జనార్ధన్ రావు.
"సార్, పగలైతే వందకు కూడా వస్తాం. కానీ ఇంత రాత్రివేళ తిరిగి ఇటుగా రావాలంటే బేరాలు దొరకవు. అందుకే.." నసిగాడు ఆటో డ్రైవర్.
ఏదో ఆలోచిస్తున్నట్లుగా కాస్త ముందుకు నడిచాడు జనార్ధన్‌రావు.
మరో ఆటోవాడు అతడి దగ్గరకు వచ్చి "సార్! ఆటో గావాల్నా?" అడిగాడు.
"చైతన్యపురికాలనీ వస్తావా?"
"వస్తా. రెండొందలు" అన్నాడు ఠకీమని.
"ఆ..."
జనార్ధన్ రావు కాస్త ఆశ్చర్యంగా చూస్తుంటే..
ఇదేదో అయ్యే బేరం కాదనుకుంటూ తనలో తనే గొణుక్కుంటూ వెళ్లిపోయాడతను.
కాసేపటి తర్వాత తన దగ్గరకు వచ్చిన ఆటోవాడి వైపు చూస్తూ "సరే.. నువ్వడిగినట్లు నూటా యాభై ఇస్తానులే.. పద వెళ్దాం" అన్నాడు.
రోడ్ నిర్మానుష్యంగా ఉండడంతో ఆటో స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నాడు ఆటో డ్రైవర్ నాగయ్య.
"ఏడుంటవ్?" ఆటో డ్రైవర్‌ని అడిగాడు జనార్ధనరావు.
"బోయగూడలో వుంటా సారు"
"అట్లనా! మా కాలనీల రోడ్లు కొత్తగా వేస్తున్నారు. అక్కడికి వెళ్లేనంక కాస్త నిమ్మలంగా ఆటో పోనియ్ సరేనా?"
"సరే సారు!"
చైతన్యపురి కాలనీలో జనార్ధన్ రావు దించిని ఇంటికి తిరుగు ముఖం పట్టాడు నాగయ్య. కాస్త దూరం వచ్చి ఆల్ఫా స్కూల్ దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్ దగ్గర ఆగాడు నాగయ్య.
పెట్రోల్ కోసమని.
"అరే! గిదేంది? గీ పెద్దాయన ఏం పెద్దమనిషో ఏంటో?" అనుకుంటూ రెండు లీటర్ల పెట్రోల్ కొట్టించుకుని చైతన్యపురి వైపు ఆటో తిప్పాడు నాగయ్య.
ఇంటి బయట ఆందోళనగా పచార్లు చేస్తున్న జనార్ధనరావు ఆటో శబ్దం విని గబగబా ఆటో దగ్గరకు వచ్చాడు.
అప్పటికే వళ్లంతా చెమటలు పట్టిన అతనికి ఎదురుగా నిలబడిన నాగయ్యను చూసేసరికి ఒక్కసారిగా ప్రాణం లేచి వచ్చినట్లుగా అనిపించింది.
"సారూ! ఇదిగో మీ పర్స్.. ఆటోలో పడిపోయింది. ఇందాక పెట్రోల్ కొట్టిస్తున్న సమయంలో" అంటూ పర్స్ అందిస్తున్న నాగయ్య వైపు కృతజ్ఞతగా చూశాడు జనార్ధన్‌రావు.
వెంటనే పర్స్ ఓపెన్ చేసి డబ్బులు లెక్క పెట్టుకున్నాడు.
తన దగ్గర వున్న పది వేల రూపాయలు అన్నీ ఐదు వందల నోట్లు సరిగ్గానే ఉన్నాయి.
"ఇగో! ఈ పైసలు తీసుకో" అంటూ ఓ ఐదొందల నోటు తీసి అందిస్తున్న పెద్దాయనతో "సార్! మీరిచ్చిన నూట యాభై ఒకే".
"అట్లనకు నాగయ్యా! గీ పైసలు తీస్కో"
"వద్దు సారు.. ఆ పైసలు మీవి. మీ కష్టార్జితం. నేను ఆటో నడిపినందుకు మీర్చిన పైసలు చాలు. నిజాయితీకి విలువ కట్టలేరు ఎవరైనా. మీ పైసలు మీ తానకు చేరినయి అదే ఆనందం నాకు".
ఎవరో కొందరు చేస్తున్న అవినీతి, మోసాలు వలన సమాజాన్ని నిందించనవసరం లేదు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఇప్పుడు జరిగిన సంఘటన అనుకున్నాడతను.
ప్రయాణం తెచ్చిన అలసట, ఏదో మూల దాగిన తన నిర్లక్ష్యం పర్సు పోయేలా చేసింది. ఇకముందు ప్రయాణాల్లో జాగ్రత్త వుండాలనుకున్నాడు.

...

అతడు మేనేజర్‌గా ప్రమోషన్ మీద "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్గొండ బ్రాంచ్" కి వచ్చి వారం రోజులే అయ్యింది.
ఉదయం పది గంటలప్పుడు బ్యాంక్‌లోకి అడుగు పెడుతుంటే కౌంటర్ దగ్గర ఓ వ్యక్తి లోన్స్ అందించే వాళ్లని ప్రాధేయపడడం కనిపిస్తుంది.
క్యాబిన్‌లోకి వెళ్లాడు.
కొద్ది సమయం తర్వాత బెల్ కొట్టాడు జనార్ధన్ రావు.
ప్యూన్ వచ్చి ఎదురుగా నిలబడ్డాడు.
"అక్కడ వికాస్ సార్‌తో మాట్లాడుతున్న వ్యక్తిని, వికాస్ సార్‌ని నా దగ్గరికి రమ్మను" అన్నాడు.
"అట్లనే సార్" అంటూ అతను వెళ్లి–వాళ్లిద్దరితో.. "సార్ మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నాడు.
జనార్ధన్‌రావుని చూస్తూనే నాగయ్య ఆశ్చర్యపోతూ "సార్, నమస్తే" అన్నాడు.
"ఏం నాగయ్య? ఈడికొచ్చినవ్? ఏం పని?"
"సారూ... అది... నాది అద్దె ఆటో. సొంతంగా ఆటో కొనాలని లోన్ కోసం వచ్చినా. గత మూడు నెలల నుండి వీళ్లు రేపురా.. మాపురా అని తిప్పుకుంటున్నారే కానీ లోన్ ఇవ్వట్లే!
"గతంలో ఉన్న మేనేజర్ అవకతవకలు.. లంచగొండివ్యవహారాలు హెడ్ ఆఫీస్‌లో తెలిసే కదా తనని ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేసి అతడిని సస్పెండ్ చేసింది.
"రేపు వచ్చి కలువు. ఏమేం పేపర్స్, డాక్యుమెంట్లు కావాలో వికాస్ సార్‌ని అడిగి తెలుసుకో. నీ పని అయిపోతుందిలే" అన్నాడు భరోసాగా మేనేజర్ జనార్ధన్‌రావు. "సరే సార్" అంటూ సంబరంగా బయటకు నడిచాడు నాగయ్య. సామాన్యులకి, మధ్య తరగతి వాళ్లకి ఆర్థిక న్యాయం జరుగుతున్నట్లువుతుంది. నిజాయితీగా లోన్స్‌కి కిస్తీలు కట్టేవాళ్లని తన ఇరవయ్యేళ్ల బ్యాంక్ సర్వీసులో ఎందర్నో చూశాడు జనార్ధనరావు. తను ఒకరికి మంచి చేస్తున్నానన్న సంతృప్తితో తన ఎదురుగా వున్న శ్రీ వేంకటేశ్వరుని క్యాలెండర్ వైపు చూస్తున్నాడు అతడు.



ఈ వీడియో చూస్తే షుగర్ పోతాది..మతి పోతుంది.. దిమ్మదిరిగి పోతుంది..
లాంటివి రోజూ చూస్తున్నా కానీ ఒక్కసారి కూడా నాకేమి కాలేదు.. నాలో లోపమా?!
DOCTOR
MD, MS, ET


..ఏందన్న...లాకర్ అడిగితే లేదంటావ్..?!
బ్లడ్ బ్యాంకు
Zakir...


లక్షల్లో లాభాలు
100%
ష్యూర్ టిప్స్
స్టాక్ మార్కెట్
Zakir...

ఈ వారం కా‘ర్టూన్స్’

# ఫొటో ఫీచర్



ఫొటోలు చూస్తుంటే పుట్టల్లా కనిపిస్తున్నాయి కదా! అయితే పొరపడినట్లే. ఇవి పుట్టలు కావు, మనుషులు నివసించే ఇండ్లు. వీటిలో రెండు, మూడు అంతస్తులు కూడా ఉంటాయి. వీటిని 'కరన్' అని పిలుస్తారు. అంటే తేనెతుట్టె అని అర్థమట. రాత్రిపూట విద్యుద్దీపాల వెలుగులో ఎంతో అందంగా కనిపిస్తాయి. చలికాలం వెచ్చగా, వేసవిలో చల్లగా ఉండే ఈ ఇండ్లు ఇరాన్‌లోని కందొవన్ లోనివి.

